

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ మంగళవారం 30-6-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 288 పేజీలు: 4 వెల: రూ.1/-


# ఆక్రమిత కాశ్మీర్‌లో చైనా కదలికలు

## నిశితంగా గమనిస్తోన్న భారత్
## ప్రపంచ వ్యాప్తంగా చైనా ప్రాజెక్టులపై కరోనా ప్రభావం

న్యూఢిల్లీ,జూన్29(ఆర్ఎన్ఎ): వేలకోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న చైనా-పాకిస్తాన్ ఎకనమిక్ కారిడార్ (సీపీఈసీ)పై కరోనా ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. ఈ కారిడార్ పాక్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా వెళుతూ ఉండడంతో భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. దీనిని అనుమతించడం లోనూ.. తాజా పరిస్తితుల్లో అక్కడ యుద్ధ విమానాలు ఎగరడంపైనా భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. సరిహద్దుల్లో ఉన్న పరిణామాల నేపథ్యంలో చైనా వేస్తున్న అడుగులను భారత్ సునిశితంగా గమనిస్తోంది. మరోవైపు కరోనా కరోనా కారణంగా ప్రపంచ వ్యవప్తంగా అనేక ప్రాజెక్టులపై దెబ్బ పడింది. చైనాను నమ్మేస్థితిలో ప్రపంచ దేశాలు లేవు. కాంబోడియాలో సిహనౌకువిలే ప్రత్యేక ఆర్థిక మండలి, ఇండోనేసియా కు చెందిన జకార్తా?బాండంగ్ హైస్పీడు రైలు ప్రాజెక్టుల పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. దీనికి సంబంధించి చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి త్వరగా ఈ ప్రాజెక్టుల్ని ప్రారంభించాలని సూచించారు. దీంతో వివిధ దేశాల్లో పట్టుకోసం చైనా చేపట్టిన ప్రాజెక్టులను కరోనా గట్టిగా దెబ్బ తీసింది. ఆసియా, ఆఫ్రికా, యూరప్‌లతో వాణిజ్య సంబంధాల బలోపేతం, పెట్టుబడులే లక్ష్యంగా ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగాలని డ్రాగన్ దేశం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు వైరస్ సెగ తగిలింది. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ) పేరిట చైనా ప్రారంభించిన మహానిర్మాణంలో అయిదో వంతు ప్రాజెక్టులపై కోవిడ్-19 ప్రభావం పడిందని చైనా విదేశాంగ శాఖలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాల డైరెక్టర్ జనరల్ జియోలాంగ్ వెల్లడించారు. 40 శాతం ప్రాజెక్టులపై అత్యంత తీవ్ర ప్రభావం, 30?40 శాతం ప్రాజెక్టులపై కొంతమేరకు కరోనా ప్రభావం పడిందని ఆయన చెప్పినట్టుగా సౌత్ చైనా మార్నింగ్ పోస్టు పత్రిక వెల్లడించింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2013లో అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఐని ప్రారంభించారు. ఆగ్నేయాసియా, మధ్య ఆసియా, గల్ఫ్ ప్రాంతం, ఆఫ్రికా, యూరప్‌లను రహదారి, సముద్ర మార్గాల ద్వారా కలుపుతూ బీఆర్ఐ మహా నిర్మాణంలో మొదలైంది. ఈ ఏడాది జనవరి నాటికి మొత్తం 2,951 ప్రాజెక్టుల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. వీటి విలువ 3.87 లక్షల కోట్ల డాలర్లు ఉ ంటుందని ఒక అంచనా. ఈ ప్రాజెక్టుల్లో అధిక భాగం పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

# నా కుర్చీకి మోడీ ఎసరు పెట్టారు

## నేపాల్ ప్రధాని ఓలీ సంచలన వ్యాఖ్యలు

ఖాట్మండూ,జూన్29(ఆర్ఎన్ఎ): నేపాల్ ప్రధాని ఓలీ సంచలన వ్యాఖ్యల చేశారు. తనను కుర్చీ నుంచి దింపేందుకు భారత ప్రధాని మోడీ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. భారత్‌కు చెందిన మూడు వ్యూహాత్మక భూభాగాలను నేపాల్‌లో కలిపిస్తూ కొత్త మ్యాప్‌ను విడుదల చేసిన తర్వాత తనను పదవి నుంచి తొలగించేందుకు పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని నేపాల్ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలీ ఆరోపించారు. అయితే, తనను గద్దె దించడం అసాధ్యమని ఆదివారం తేల్చిచెప్పారు. ఖాట్మాండూలోని ఓ హోటల్‌లో తనపై కుట్రలకు కార్యాచరణ జరుగుతోందని, ఇందులో ఓ దేశ రాయబార కార్యాలయం చురుగ్గా పాల్గొంటోందని పరోక్షంగా భారత్‌ను ఉద్దేశించి విమర్శలు చేస్తున్నారు. భారత భూభాగాలైన లిపూలేఖ్, కాలాపానీ, లింపియాధురా ప్రాంతాలను నేపాల్‌కు చెందినవంటూ మ్యాప్ రూపొందించి.. దానిపై రాజ్యాంగ సవరణ చేసిన ఓలీ.. ఈ మ్యాప్ రూపకల్పన వల్లే భారత్ తన ప్రభుత్వాన్ని కూలదోయాలనుకుంటోందని ఆరోపించారు. తమ ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు భారత్ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.

# కాశ్మీర్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

# హిజ్బుల్ కమాండర్ సహా మరో ఇద్దరు హతం

## ఇక ఉగ్రవాద విముక్త జిల్లాగా దోడా

శ్రీనగర్,జూన్29(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు హిజ్బుల్ ముజాహిదిన్ కమాండర్ మసూద్ అహ్మద్ భట్‌ను హతమార్చాయి. దక్షిణ కశ్మీర్ జిల్లాలోని కుల్‌చోరాలో ఇవాళ జరిగిన ఎన్‌కౌంటర్‌లో అహ్మద్ భట్‌తో పాటు మరో ఇద్దర్ని హతమార్చారు. దీంతో దోడా జిల్లా ఇక ఉగ్రవాద విముక్త జిల్లాగా మారినట్లు అధికారులు వెల్లడించారు. ఆర్మీ, జేకే పోలీస్, సీఆర్‌పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఎన్‌కౌంటర్ ప్రాంతం నుంచి ఓ ఏకే రైఫిల్, రెండు పిస్తోళ్లు రికవర్ చేశారు. హిజ్బుల్ కమాండర్ అహ్మద్ భట్‌తో పాటు ఇద్దు లష్కరే తోయిబా ఉగ్రవాదులను హతమార్చినట్లు జమ్మూకశ్మీర్ పోలీసు చీఫ్ దిల్‌బాగ్ సింగ్ మీడియాతో తెలిపారు. మసూద్ ఓ రేప్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. దోడా పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు ఉన్నది. అప్పటి నుంచి అతను పరారీలో ఉన్నాడు. కోకర్‌నాగ్, త్రాల్, క్రీవ్ ప్రాంతాల్లో ఉన్న 29 మంది విదేశీ ఉగ్రవాదులను త్వరలోనే హతమార్చనున్నట్లు ఐజీ విజయ్‌కుమార్ తెలిపారు. దక్షిణ కశ్మీర్ నుంచి ఉగ్రవాదాన్ని తరిమివేయాలన్న దీక్షతో భద్రతా దళాలు పనిచేస్తున్నాయి. త్రాల్ ప్రాంతంలో హిజ్బుల్ ముజాహిద్దిన్ ఉగ్రవాదులను హతమార్చడంతో ఆ ప్రాంతం విముక్తి అయినట్లు పోలీసులు చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వంద కన్నా ఎక్కువ సంఖ్యలో ఉగ్రవాదులను హతమార్చినట్లు ఇటీవల హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు.

### హురియత్ నుంచి తప్పుకున్నగిలానీ

ఇదిలావుంటే కాశ్మీర్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కశ్మీర్ వేర్పాటువాద నేత సయ్యద్ అలీ షా గిలానీ.. హురియత్ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. తన నిర్ణయానికి సంబంధించి ఓ ఆడియో మెసేజ్‌ను ఆయన విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా.. ఆల్ పార్టీ హురియల్ కాన్ఫరెన్స్ నుంచి రిజైన్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. హురియత్‌లోని అన్ని భాగస్వాములకు ఈ విషయాన్ని వెల్లడించినట్లు ఆయన చెప్పారు. దాదాపు 27 ఏళ్ల నుంచి హురియత్‌తో ఆయనకు అనుబంధం ఉన్నది.

1993 నుంచి హురియత్‌లో గిలానీ భాగస్వామిగా ఉన్నారు. 2003లో ఆయన్ను జీవితకాల చైర్మన్‌గా ప్రకటించారు. అయితే తన రాజీనామాకు సరైన కారణాలను ఆయన వెల్లడించలేదు. కొన్ని నెలల నుంచి గిలానీ ఆరోగ్యం సరిగాలేదు. ప్రస్తుతం వైద్యం తీసుకుంటున్నా.. నిలకడగానే ఉన్నారు.

# హోంమంత్రి మహమ్మద్ అలీకి కరోనా పాజిటివ్



## ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు తరలింపు
## హైదరాబాద్‌లో కేసులపై పుకార్లు షికార్లు

హైదరాబాద్,జూన్29(ఆర్ఎన్ఎ): భాగ్యనగరంలో కరోనా విలయతాండవం చేస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిలో పూర్తి లాక్‌డౌన్ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ఇదిలా ఉంటే తాజాగా తెలంగాణ హోంమంత్రి మహమూద్ అలీకి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో ఆయనను అపోలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డాక్టర్ల పర్యవేక్షణలో హోంమంత్రికి వైద్యం అందిస్తున్నారు. ఆయన మనవడికి కూడా కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇప్పటికే ఎమ్మెల్యేలు బీగాల గణెశిశ్, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిలు యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నరాఉ. అలాగే కాంగ్రెస్ సీనియనరర్ నేత విహెచ్ కూడా ఆస్పత్రిలో చికిత్ పొందుతున్నారు. మరోవైపు కరోనా కేసులుతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. హోంమంత్రితో తిరిగిన వారిని క్వారంటైన్‌కు పంపిస్తున్నారు. అలాగే హోంమంత్రి నివాసం ఉండే పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది శానిటైజర్ చేస్తున్నారు. హోంమంత్రి ఆరోగ్యంపై సహచర మంత్రులు వాకబు చేస్తున్నారు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

హోంమంత్రి ఆరోగ్యంపై సహచర మంత్రులు వాకబు చేస్తున్నారు. కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. మరోవైపు హైదరాబాద్ పరిధిలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. ప్రతిరోజు 800 నుంచి 1000 వరకు కేసులు నమోదవుతున్నాయి. దాంతో నగర ప్రజలు గడపదాటాలంటేనే భయపడు తున్నారు. దాంతో కొంతమంది వ్యక్తులు కావాలనే ఫేక్ వార్తలు పుట్టిస్తున్నారు. అక్కడ కరోనా సోకింది.. ఇక్కడ కరోనా సోకింది.. అక్కడ అంతమంది చనిపోయారు.. ఇక్కడ ఇంతమంది చనిపోయారు అని లేనిపోని పుకార్లు పుట్టించి జనాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తాజాగా బార్కస్ లో 10 కరోనా మృతదేహాలు, డబీర్ పురాలో 25 కరోనా మృతదేహాలు గుట్టుచప్పుడు కాకుండా కాల్చేశారని కొన్ని వార్తలు ఫేస్ బుక్, వాట్సాప్ మొదలైన సోషల్ మీడియా ఖాతాల్లో ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో చక్కర్లు కొడుతున్నాయి. వీటిని పరిశీలించిన అధికారులు.. ఇవన్నీ ఫేక్ వార్తలని తేల్చారు.

కరోనా వైరస్ విషయంలో ఫేక్ వార్తలు పుట్టించి.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసులు హెచ్చరించారు. ఇలాగే బెంగుళూరులో కూడా రెండు రోజుల క్రితం ఓ ఫేక్ వార్త అందరినీ కలవరపెట్టింది. సిటీలోని కొన్ని బేకరీలు, రెస్టారెంట్లకు సంబంధించిన ఉద్యోగులకు కరోనాసోకిందని వార్త పుట్టించారు. ఆ బేకరీలు, రెస్టారెంట్లు మరియు అవి ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉంటేనే మంచిదని ప్రచారం చేశారు. దాంతో బెంగుళూరు హోటల్స్ అసోసియేషన్ నగర కమిషనర్ కి ఫిర్యాదు చేశారు. సిటిలో ఏ హోటల్ లేదా బేకరీ ఉద్యోగులకు కరోనా సోకలేదని ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు.

# కరోనాతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వికారాబాద్,జూన్29(ఆర్ఎన్ఎ): జిల్లాలో కరోనాతో ఒకరి మృతి చెందారు. బొంరాస్పేట మండలం తుంకిమెట్ల గ్రామానికి చెందిన చిక్కలి అనంతయ్య (65)కు కరోనా సోకడంతో 15 రోజుల నుంచి హైదరాబాద్ లోని గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం రాత్రి అనంతయ్య మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని మండల వైద్యాధికారి రవీంద్ర యాదవ్ తెలిపారు. కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో అవసరం ఉంటే తప్ప ప్రజలు బయటకు రావొద్దని, మాస్క్, శానిటైజర్ తప్పక వాడాలని వైద్యులు సూచిస్తున్నారు.

# నేటితో ముగియనున్న లాక్‌డౌన్ ఆంక్షలు

## దేశవ్యాప్తంగా రోజుకు 20 వేల కేసులు నమోదు
## ఆయా రాష్ట్రాల్లో పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు

న్యూఢిల్లీ,జూన్29(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ కలకలం రేపుతోంది. రోజుకు 20వేల కరోనా కేసులు నమోదవుతున్నాయి. ప్రధాన నగరాలు కరోనా హాట్‌స్పాట్‌లు మారిపోతున్నాయి. చెన్నై, ఢిల్లీ, ముంబై, పుణెళి, హైదరాబాద్, అహ్మదాబాద్‌లలో కరోనా విలయం సృష్టిస్తోంది. దీంతో ఇప్పుడు దేశ వ్యాప్తంగా మళ్లీ లాక్‌డౌన్ తప్పదన్న మాటలు వినిపిస్తున్నాయి. నిజానికి ఈ నెల 30తో అన్ లాక్ 1. ముగియనుంది. ఇప్పుడు కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందన్న చర్చ సాగుతోంది. మళ్లీ లాక్ డౌన్ వైపు మొగ్గు చూపుతుందా? అనేది ఆసక్తి రేపుతోంది. మరోవైపు ఆయా రాష్ట్రాలు మాత్రం సొంతంగా లాక్ డౌన్ విధించుకోవాలన్న దిశగా ఆలోచిస్తున్నాయి. ఎక్కడిక్కడ కేసులను బట్టి నిర్ణయాలు తీసుకుంటున్నారు.

దేశవ్యాప్తంగా కరోనా విజృంభణ కొనసాగుతున్న వేళ మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో అత్యధిక సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. కరోనా కేసులు 15 వేలకు పైగా పెరగడం వరుసగా ఇది ఆరో రోజు. ఈ క్రమంలో పలు రాష్ట్రాలు మరో రెండు వారాల పాటు లాక్‌డౌన్ విధించే యోచనలో ఉన్నాయి. కరోనా కట్టడి కోసం మధ్యప్రదేశ్, యూపీ రాష్ట్రాల్లో ఇంటింటి సర్వే నిర్వహించాలని నిర్ణయించగా.. గోవా, ఢిల్లీ, ఒడిశా వంటి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మరో రెండు వారాల పాటు లాక్‌డౌన్ విధించాలని భావిస్తున్నాయి. అస్సాం గువాహటిలో ఆదివారం నుంచి లాక్‌డౌన్ అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే కరోనా సంక్షోభం ఇంకా ముగియకపోవడంతో జూన్ 30 తర్వాత కూడా ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఇప్పటికే తెలంగాణలో వైద్య అధికారులు మరో రెండు వారాల పాటు లాక్‌డౌన్ విధించాల్సిందిగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సూచించిన సంగతి తెలిసిందే. దీనిపై రెండు మూడు రోజుల్లో నిర్ణయం వెలువడనుంది. కరోనా వ్యాప్తి కట్టడి కోసం పలు రాష్ట్రాలు నూతన విధానాలను అమలు చేయనున్నాయి. ప్రస్తుతం భారతదేశంలో కరోనా కేసుల సంఖ్య 5,28,859గా ఉండగా.. లక్షమందికి పైగా కోలుకున్నారని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. రికవరీ రేటు 58.56 శాతం ఉన్నట్లు ప్రకటన విడుదల చేసింది. జూన్ 1 నుంచి అన్‌లాక్.1 అమల్లోకి రావడం.. ఆంక్షలు సడలించడంతో కేసుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఫలితంగా జూన్ 1 నుంచి దేశవ్యాప్తంగా 3,38,324 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ అన్‌లాక్ కాలంలోనే ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని.. కరోనా నియమాలు పాటించడంలో అలసత్వం పనికిరాదని ప్రజలను హెచ్చరించారు. కరోనా విషయంలో అజాగ్రత్తగా ఉంటే మనతో పాటు ఇతరుల జీవితాలను కూడా ప్రమాదంలో పడేసినవాళ్లం అవుతామన్నారు. 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. 'కరోనాను ఓడించడం.. దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రస్తుతం ప్రజలు దృష్టి సారించాల్సి ఉంది. మాస్క్ ధరించడం.. రెండు మీటర్ల దూరంతో పాటు ఇతర నిబంధనలను పాటించకపోతే.. మిమ్మల్ని, మీతో పాటు ఇతరులు.. ముఖ్యంగా మీ కుంటుంబంలోని వృద్ధులు, పిల్లలను ప్రమాదంలో పడేసిన వారు అవుతారు' అని హెచ్చరించారు. ఆర్థిక రాజధాని ముంబైలో ఆఫీసులకు, అత్యవసర వైద్య సేవలకు హాజరు కావడం తప్ప నగరవాసులు తమ ఇళ్ల నుంచి రెండు కిలోమీటర్లు దాటి వెళ్లవద్దని పోలీసులు కోరారు. రాష్ట్రంలో కంటైన్మెంట్ జోన్లలో ఆంక్షల సడలింపుతో పాటు సెలూన్లు తెరవడానికి ప్రభుత్వం ఆదివారం అనుమతిచ్చింది. దేశ రాజధాని ఢిల్లీలో కేసులు భారీగా పెరగటంతో అధికారులు కొత్త వ్యూహాన్ని అమలు చేయనున్నారు. కంటైన్మెంట్ జోన్ల సంఖ్యను 218 నుంచి

417 కి పెంచారు. కరోనా వ్యాప్తిని గుర్తించడం కోసం ఇంటింటి సర్వేలో భాగంగా కేవలం ఒక నెల రోజుల్లోనే సుమారు 2.45 లక్షల మంది ప్రజలను పరీక్షించారు. కరోనా కట్టడి కోసం ఇంటింటి సర్వే జూలై 6 వరకు పూర్తి కావాల్సి ఉ ండగా.. ఇప్పటికే 2 లక్షల మందిని పరీక్షించామని అధికారులు తెలిపారు.

పల్స్ పోలియో మాదిరిగానే ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు యూపి అధికారులు చెప్పారు. కంటైన్మెంట్, నాన్ కంటైన్మెంట్ జోన్లలో కూడా సర్వే నిర్వహిస్తామన్నారు. 13,186 కేసులు నమోదైన మధ్యప్రదేశ్‌లో కరోనా వ్యాప్తిని నియంత్రించడానికి జూలై 1 నుంచి 'కిల్ కరోనా' ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీనిలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించబడుతుందని..ఇతర వ్యాధులపై కూడా పౌరులకు పరీక్షలు జరుపుతామని ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ క్రమంలో కరోనా కట్టడి కోసం ప్రభుత్వం కమ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో మరోసారి పూర్తి లాక్‌డౌన్ విధించింది. గువాహటి దీని కిందకే వస్తుంది. ఇక్కడ ఆదివారం రాత్రి 7 నుంచి జూలై 12 సాయంత్రం 6 గంటల వరకు లాక్‌డౌన్ అమల్లో ఉంటుంది. కిరాణా, మాంసం, అన్ని ఇతర దుకాణాలు మూత పడతాయి. ఫార్మసీలు మాత్రమే పనిచేయడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది.

# తమిళనాట ఆందోళనకరంగా కరోనా కేసులు

చెన్నై,జూన్29(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి రాష్ట్రంలో విలయ తాండవం చేస్తున్నది. ప్రధానంగా చెన్నైలో వైరస్ కరాళతాండవానికి తోడు మరణమృదంగం మార్మోగుతోంది. కరోనా నివారణ చర్యలు, అవగాహన, సమాచారాలు, ప్రభుత్వాలు తీసుకునే చర్యలు అంటూ ఎప్పటికప్పుడు ప్రజలకు చేర వేయడంలో మీడియా పాత్ర కీలకం. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, కరోనా కాలంలోనూ ఏ మాత్రం తగ్గకుండా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారాలు చేర వేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. అయితే, వీరిని సైతం కరోనా వదలి పెట్టలేదు. తొలుత ఓ ఇద్దర్ని, ఆ తర్వాత నలుగుర్ని అంటూ కరోనా వైరస్ దాడి చేయడం మొదలెట్టింది. ఓ ప్రముఖ తమిళ పత్రికలో అయితే, పదుల సంఖ్యలో సిబ్బంది కరోనా బారిన పడక తప్పలేదు. ఇందులో ఓ నాన్ జర్నలిస్టు మరణించారు. తాజాగా తమిళనాట కరోనా బారిన పడ్డ మీడియా ప్రతినిధి ఈ.వేల్ మురుగన్ మరణించడంతో జర్నలిస్టు వర్గాల్ని ఆందోళనలో పడేసింది. నిత్యం సమాచార సేకరణలో చురకుగా ఉండే సీనియర్ కెమెరామెన్‌ను కరోనా కబళించడంతో సర్వత్రా దిగ్భ్రాంతికి లోనయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పళనిస్వామి ఆ కుటుంబానికి రూ.5 లక్షలు సాయం ప్రకటించారు. రోజు రోజుకు చెన్నైలో కరోనా కేసులు పెరిగే కొద్ది జనంలో భయం అన్నది పెరిగి ఉన్న నేపథ్యంలో వారిలో భరోసా, ధైర్యాన్ని , అవగాహనను నింపే కథనాలు, వార్త సమాచారాలతో ముందుకు సాగుతున్న జర్నలిస్టు సమాజాన్ని కలవరంలో పడేస్తూ శనివారం అతను మృత్యుఒడిలోకి చేరాడు. వేల్ మురుగన్ మరణ సమాచారంతో సీఎం పళని స్వామి, డిప్యూటీ సీఎం పన్నీరుసెల్వం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షలు సాయాన్ని సీఎం ప్రకటించారు. వేల్‌మురుగన్ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. అలాగే, తెలంగాణా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన సంతాపం వ్యక్తం చేశారు. వేలు మృతికి తెలంగాణ జర్నలిస్టుల జాక్ సంతాపం ప్రకటించింది. జాక్ కన్వీనర్ దేవరకొండ కాళిదాస్, కో కన్వీనర్ అవ్వారు రఘులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి సానుభూతిని తెలియచేశారు. మత్స్య శాఖ మంత్రి జయకుమార్, ఆరోగ్య మంత్రి విజయభాస్కర్ వ్యక్తిగతంగా సంతాపం తెలియజేస్తూ ఆ కుటుంబానికి తలా రూ. 50 వేలు సాయం ప్రకటించారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఎంపీ కనిమొళి తమ సంతాపం తెలియజేశారు. జర్నలిస్టు సంఘాల నేతలు తమసంతాపం తెలియజేస్తూ సాయం అందించేందుకు నిర్ణయించారు. జర్నలిస్టులు కరోనా బారిన పడుతున్నారని వీరికి వైద్య సేవల నిమిత్తం ప్రత్యేక బీమా పథకం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. చెన్నై రాజీవ్‌గాంధీ ఆస్పత్రిలో పదిహేను రోజులుగా చికిత్స పొందుతూ వచ్చిన వేల్‌మురుగన్ పరిస్థితి క్రమంగా క్షీణించి శనివారం ఉదయాన్నే మరణించడంతో తమిళనాట ఉన్న ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్గాల్ని కలవరంలో పడేసింది.

## జర్నలిస్ట్ మృతితో సర్వత్రా ఆందోళన
## సంతాపం తెలిపిన తెలంగాణ గవర్నర్ తమిళిసై
## వేలు మృతిపై తెలంగాణ జాక్ సంతాపం

### చరిత్రలో నేటినిజం



కం॥ "బలిజేపల్లి" కులంబున
లలితాత్ముండగు రమణుడు "లక్ష్మీకాంతం"
బిల నాటకరచనలతో
పలువురిచే ఘటికుడనుచు ప్రస్తుతులగాంచెన్!!

(జూన్ 30 బలిజేపల్లి లక్ష్మీకాంతం జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210






నల్లగొండ పర్యటనలో భాగంగా చిట్యాలలో ఆరో విడుత హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కులు నాటిన మంత్రులు కేటీఆర్, జగదీష్ రెడ్డి

# అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

## అభివృద్ధి చేస్తేనే ప్రజలు ఆదరిస్తారు
## ఇప్పట్లో ఎన్నికలు ఏవీ లేవు
## అందుకే మా లక్ష్యం అభివృద్ధి
## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కెటిఆం

సూర్యాపేట,జూన్29(ఆర్ఎన్ఎ): రాజకీయాల్లో అధికారం శాశ్వతం కాదని, ఎవరమైఆన ఓ సారి గద్దె దిగక తప్పదని మంత్రి కెటిఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు ఆదరించినంత కాలమే పదవుల్లో ఉ ంటామన్నారు. అధికారంలో ఉన్నంత కాలం ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తేనే ఆదరిస్తారని అన్నారు. పార్టీలకు అతీతంగా తెలంగాణలో అభివృద్ధి జరుగుతున్నదని, ఇప్పుడు ఎన్నికలు ఏమి లేవు కనుక..మా ముందున్న లక్ష్యం అభివృద్ధి మాత్రమే అన్నారు. జిల్లాలోని హుజూర్ నగర్ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్డీవో కార్యాలయాన్ని పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, సహచర మంత్రి జగదీష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. హుజూర్‌నగర్ పురపాలక సంఘం భవన కార్యాలయంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మంత్రులు మొక్కలు నాటారు. పురపాలక సంఘం పరిధిలో నూతనంగా నిర్మించ తలపెట్టిన అర్బన్ పార్క్ నిర్మాణంతో పాటు స్కిల్ డెవలప్ మెంట్ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ..పాలనను ప్రజల ముంగిటకు తెస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన సంస్కరణలకు తెరలేపారన్నారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ లు, మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇవన్నీ కూడా కొందరికి పదవుల కోసం కాదన్నారు. కేవలం ప్రజలకు పాలనా వికేంద్రీకరణ చేరాలన్నదే లక్ష్యమన్నారు. నేడు సంక్షేమ ఫలాలు ప్రజల ముంగిటకు వచ్చాయని తెలిపారు. చిట్టచివరి మనిషి వరకు ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను అక్రమిస్తే ఉపేక్షించేది లేదని, వారిపట్ల కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. కరోనాతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇంత కష్ట కాలంలో కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ 54 లక్షల 22 వేలమంది రైతులకు రూ.7 వేల కోట్లను రైతుబంధు కింద ఆర్థిక చేయూత ఇచ్చారని వెల్లడించారు. అందరికి ఆసరా పెన్షన్లను, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు డబ్బులు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌లో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇప్పించడం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని అన్నారు. హైదరాబాద్ టు విజయవాడకు హై స్పీడ్ రైలు ఏర్పాటు చేసేలా ప్రయత్నం చేస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. లాక్ డౌన్ కారణంగా రాష్ట్ర ఆదాయం కొంత దెబ్బతిన్నది. అయినా కూడా వేగంగా పుంజుకుంటున్నాం. నెలనెలా మున్సిపాలిటీలకు, పంచాయతీలకు ఇచ్చే నిధులను అందిస్తున్నామని తెలిపారు. ఉన్న కార్యక్రమాలను పూర్తి చేయడం మినహా కొత్త కార్యక్రమాలనుముందుకు తీసుకుని వెళ్లే అవకాశం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీలు బడుగుల లింగయ్య యాదవ్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, డా.గాదరి కిశోర్ కుమార్, భాస్కర్ రావు, చిరుమర్తి లింగయ్య, మల్లయ్య యాదవ్, ఎమ్మెల్సీ చిన్నపరెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ దీపిక, మాజీ ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందర్ రావు, వేమిరెడ్డి నరసింహ రెడ్డి పాల్గొన్నారు. దీంతో రైతులు చాలా సంతోషంగా వానాకాలం సాగును ప్రారంభించారు.

# కరోనికల్‌పై ప్రయోగాలు చేస్తే తప్పేముంది?

నేటి నిజం
మంగళవారం 30-6-2020

భారతదేశంలో కరోనా వ్యాప్తి తీవ్రం అయ్యిందనడానికి ఇటీవలి కేసుల సంఖ్యను చూస్తే తెలుస్తుంది. దీనికి తోడు తెలుగు రాష్ట్రాల్లోనూ కేసుల సంఖ్య పెరుగుతోంది. కొన్ని జిల్లాల్లో మళ్లీ లాక్‌డౌన్‌లు విధిస్తున్నారు. తాజాగా ప్రజాప్రతినిధులకు కూడా కరోనా అంటుకోవడం కలవరానికి గురిచేస్తోంది. ఆస్పత్రుల్లో వైద్యం సరిగా చేయడం లేదన్న విమర్శలు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. కొన్ని రోజులుగా తెలంగాణలో వ్యాధి వ్యాప్తి తీవ్రంగా ఉన్నది. రానున్న రోజులలో కేసుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నది. గుజరాత్‌లోనూ, తెలంగాణలోనూ కొత్తగా నిర్ధారణ అయిన కేసులు సుమారుగా ఒకే మొత్తంలో ఉండగా, పరీక్షలలో మాత్రం విపరీతమైన వ్యత్యాసం ఉన్నది. వ్యాప్తి తీవ్రత విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో మెరుగుగా ఉన్నదని ఈ పరిశీలన సూచిస్తున్నది. కర్ణాటకతో పాటు ఆంధ్రప్రదేశ్ కూడా రోజువారీ కేసుల సంఖ్య విషయంలో నిలకడ సాధించినట్టు తెలుస్తున్నది. కేసుల తీవ్రత అత్యధికంగా ఉన్న రాష్ట్రాలలో కూడా వ్యాప్తి తీవ్రత రేటు తెలంగాణలో ఉన్నంతగా లేదు. తక్కువ పరీక్షలు చేయడం అనే విమర్శను మొదటినుంచి ఎదుర్కొంటున్న తెలంగాణలో ఇప్పుడు కేంద్ర బృందం పరిశీలనకు వచ్చింది. కేసులు పెరగడంతో గుజరాత్, తెలంగాణల్లో కేంద్ర బృందం సభ్యులు పరిశీలన చేపట్టారు. ఇకపోఏ ఇంతకాలం టెస్టులు చేయకుండ ఆపక్కన పెట్టారన్న విమర్శలు ఉన్నాయి. అధికారపార్టీకే చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు తోడు తాజాగా హోంమంత్రి మహ్మూద్ అలీకి కూడా కరోనా పాజిటివ్ కేసు వచ్చింది. కాంగ్రెస్ నేతలు వి హెచ్, గూడూరు నారాయణ రెడ్డిలకు కూడా పాజిటివ్ వచ్చింది. తమిళనాడు, బెంగాల్లో ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు మృతి చెందారు. ఇకపోతే తెలంగాణలో కొత్తగా చేస్తున్న పరీక్షలలో 30 శాతం దాకా పాజిటివ్ నిర్ధారణలు జరగడం ఆందోళనకరం. కరోనాకు అవసరమైన చికిత్స చేస్తున్ఆనమని అంటున్నా ఆస్పత్రుల తీరు అధ్వాన్నం అంటూ విమర్శలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉన్నది. జనగామ, పరకాల, ములుగు పట్టణాలలో కొత్తగా లాక్‌డౌన్ నిబంధనలను కఠినం చేయవలసివచ్చింది. హైదరాబాద్ లోని బేగం బజార్, సిద్ధి అంబర్ బజార్లలో హోల్ సేల్ వ్యాపారులు స్వచ్ఛందంగా వ్యాపారవేళలను తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. సికింద్రాబాద్ జనరల్ బజార్ పరిసర వ్యాపార ప్రాంతాలన్నిటిలోనూ పూర్తి స్వచ్ఛంద లాక్‌డౌన్ పాటించాలని వ్యాపారులే నిర్ణయించారు. కొద్దిపాటి ఉద్యోగులతో కార్యాలయా లను ప్రారంభించిన సాఫ్ట్‌వేర్ కంపెనీలు తిరిగి పూర్తిగా మూసివేయడం మొదలుపెట్టాయి. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని పట్టణాలలో ప్రకటిత, అప్రకటిత లాక్‌డౌన్ అమలు జరుగుతున్నది. తాజాగా గ్రేటర్ హైదరాబాద్‌లో మరోమారు లాక్‌డౌన్ విధించాలన్న డిమాండ్ పెరిగింది. దీనిని పరిశీలిస్తామని సిఎం కెసిఆర్ ప్రకటన చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులలో స్పష్టమైన కరోనా లక్షణాలు న్న వారినే చేర్చుకుంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రులలో అందరినీ చేర్చుకుంటున్నా..అక్కడ పడకల కొరత , ఫీజులు మోత సాధారణ ప్రజలకు ప్రతిబంధకంగా ఉన్నాయి. కరోనా విషయంలో కేవలం ప్రాణభయం మాత్రమే కాదు, ఆర్థిక భయం కూడా మధ్యతరగతి వారిని వేధిస్తున్నది. ప్రతి ఇంట్లోనూ కరోనా పరీక్షలు జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగ్గదే. కరోనా పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఒక నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుచేయాలి. ముఖ్యంగా, హైదరాబాద్ మహానగరానికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలి. లేకపోతే, కేవలం భయంతో, అపనమ్మకంతో ప్రజలలో కలవరం పెరిగే అవకాశం ఉన్నది. ప్రజల ప్రాణాలకు ప్రమాదం పెరుగుతున్న దశలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నదన్న అపవాదు తెచ్చుకోవడం మంచిది కాదు. ఇకపోతే ఇప్పటికిప్పుడు వ్యాక్సిన్ వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. అయితే రోగనిరోధక శక్తిని పెంచే దిశగా ప్రజలు ఎవరికి వారు చర్యలు తీసుకుంటు న్నారు. దేశీయంగా పతంజలి సంస్థ విడుదల చేసిన కనోనికల్‌ను నిషేధించడం సబబు కాదు. దాని గుణాలను అధ్యయనం చేసి లేదా వాడి చూడడం మంచిది. ఏమాత్రం కరోనా రోగులకు ఇది వినియోగం అయినా మంచిదే. దివ్య ఔషధంగా ఉపయోగ పడితే మరీ మంచిది. యోగా గురు బాబా రాందేవ్ తమ సంస్థ కరోనా నివారణకు ఔషధాన్ని రూపొందించిందని ప్రకటించి నప్పుడు చాలామంది ఆశాభావంతో ఆనందం వ్యక్తం చేశారు. బాబా రాందేవ్ పట్ల వారికున్న విశ్వాసం అలాంటిది. కరోనా మహమ్మా రిపై అలుముకునివున్న భయాందోళనల నేపథ్యంలో ఇది పనికి రాగలదన్న భరోసా కలిగింది. అయితే కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ యోగాగురు ప్రకటనను ఖండించడంతో దీనివాడకంపై ఆంక్షలు వచ్చాయి. కరోనా మహమ్మారిని అంతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు రాత్రింబగళ్లు పరిశో ధనలు చేస్తున్నారు. ఎన్నో ఫార్మా సంస్థలు ఇందులో పాలుపంచుకుం టున్నాయి. ఈ దశలో తాము రూపొందించిన ఔషధాల కిట్ కరోనా నుంచి అందరినీ కాపాడుతుం దంటూ బాబా రాందేవ్ చేసిన ప్రకటన దేశంలోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఆయన చెబుతున్న ప్రకారం కిట్‌లోని కొరొనిల్, శ్వాసరి ఔషధాలను కరోనా రోగులపై ప్రయోగించినప్పుడు ఏడురోజుల్లో 100 శాతం ఫలితాలొచ్చాయి. మూడురోజుల పాటు ఈ ఔషధాలు వాడాక 69 శాతంమంది రోగులు పూర్తిగా కోలుకుంటే మిగిలినవారు కోలుకోవడానికి మరో నాలుగు రోజులు పట్టింది. క్లినికల్ ట్రయల్ అనుమతితో రోగులపై ఈ ఔషధాలను ప్రయోగించామని ఆయన వివరించారు. ఈ ఔషధాలను హరిద్వార్‌లోని పతంజలి రీసెర్చ్ సెంటర్, జైపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సె స్‌లో అభివృద్ధి చేశామని సంస్థ ప్రకటించింది. కరోనిల్‌లో వాడిన అశ్వగంధ, తులసి, తిప్పతీగ వంటివి ఎవరికీ తెలియనివి కాదు. అశ్వగంధకు రోగనిరోధక శక్తి పెంపొం దించడంలో, నాడీ వ్యవస్థను బలోపేతం చేయడం లో తోడ్పడుతుందన్న పేరుంది. తులసి, తిప్పతీగ వంటివి కూడా వాడకంలో వున్నవే. కష్టకాంలో ఉన్న దశళో ఈ ఔషధం వల్ల నిజంగానే రోగనిరోధక శక్తిని పెంచగలిగితే ఆమేరకు అయినా దానిని ఉపయోగించవచ్చు. అందువల్ల దేశీయంగా ఉన్న ఈ ఔషధాన్ని పరిశీలించి ప్రయోగించేందుకు కేంద్రం ముందుకు రావాలి.

## వైద్యరంగం పూర్తిగా భ్రష్టు పట్టింది

### టిడిపి పాలనతో వెనకబడి పోయాం

### మండిపడ్డ వైద్యారోగ్య శాఖ మంత్రి ఆళ్లనాని

అనంతపురం,జూన్29(ఆర్ఎన్ఎ): టిడిపి హయాంలో ఎపిలో వైద్యరంగం పూర్తిగా భ్రష్టు పట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) విమర్శించారు.

రాష్ట్రంలో అత్యధిక వెనుకబడిన జిల్లా అనంతపురంలో గత పాలక ప్రభుత్వాలు అభివృద్ధి పరంగా నిర్లక్ష్యం చేశారనీ ఆళ్ల నాని విమర్శించారు. సోమవారం జిల్లాలోని హిందూపురం పార్లమెంటు పరిధిలో ఆగస్టు నెలలో నిర్మాణం చేపట్టబోయే మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సంబంధించి పెనుకొండ జాతీయ రహదారి సమీపంలో స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టారన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో వైద్య ఆరోగ్య రంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారని... వాటన్నింటినీ అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఆగస్టులో దాదాపు నాలుగు వందల కోట్లతో టెండర్లు పూర్తి చేసి అతి త్వరలో పనులు పూర్తి చేస్తామని మంత్రి ఆళ్లనాని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, మంత్రి ఆళ్ల నానితో పాటు బీసీ సంక్షేమ శాఖ మంత్రి శంకర నారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు పాల్గొన్నారు.

## 2 నుంచి మంత్రాలయంలోకి అనుమతి

### -కరోనా నిబంధనల మేరకు నిర్ణయం

మంత్రాలయం,జూన్29(ఆర్ఎన్ఎ): చాలా ఆలయాల్లో భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నప్పటికీ కరోనా నేపథ్యంలో మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠం అధికారులు ఇప్పటివరకు ఆచితూచి అడుగులు వేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దేవాదాయశాఖ మార్గదర్శకాలను అనుసరిస్తూ తగిన ఏర్పాట్లు చేశారు. జులై 2వ తేదీ నుంచి దర్శన భాగ్యం కల్పించాలని నిర్ణయించినట్లు మఠం మేనేజర్ వెంకటేష్ జోషి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్లలోపు, 65 ఏళ్లు పైబడినవారు, గర్భిణులు, కంటైన్‌మెంటు జోన్ల నుంచి వచ్చేవారు మినహా అందరికీ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. థర్మల్ స్క్రీనింగ్ చేసిన తర్వాత కొవిడ్ లక్షణాలు లేనివారినే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మాత్రమే దర్శనాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్నవితరణ, ప్రసాదాల పంపిణీ తదితరాలు ప్రస్తుతానికి లేవన్నారు. ఆర్జిత సేవలు పరోక్షంగా నిర్వహిస్తామని, గర్భగుడి దర్శనాలు లేవన్నారు. మరోవైపు దర్శనాలకు వచ్చే భక్తుల కోసం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

## గౌహతిలో మరోమారు లాక్‌డౌన్

### ఇళ్లకే పరిమితం అయిన ప్రజలు

గౌహతి,జూన్29(ఆర్ఎన్ఎ): అసోంలో కరోనా కేసుల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర రాజధాని గౌహతి ప్రాంతంలో సోమవారం నుంచి పూర్తిగా లాక్‌డౌన్‌ను అమలు చేస్తున్నారు. దీంతో కామ్‌రూప్ జిల్లాలో జన జీవనం పూర్తిగా స్తంభించింది. మరోసారి లాక్‌డౌన్ విధించడంతో జనం ఇండ్లకే పరిమిత మయ్యారు. దీంతో ఎప్పుడు జన రద్దీగా ఉండే గౌహతి నగరంలోని రహదారులు సోమవారం బోసిపోయాయి. జన సంచారం లేక నగర వీధులు నిర్మానుష్యంగా మారాయి. మరోవైపు పోలీసులు ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. జనం ఇండ్ల నుంచి బయటకు రాకుండా చూస్తున్నారు. లాక్‌డౌన్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఇప్పటికే హెచ్చరించారు. కామ్‌రూప్ జిల్లాలో పూర్తి లాక్‌డౌన్‌ను 14 రోజులపాటు అమలు చేయనున్నారు. మిగతా ప్రాంతాల్లో రాత్రి కర్ఫ్యూను రాత్రి 8 గంటల నుంచి అమలు చేస్తున్నారు. అసోంలో మొత్తం కరోనా కేసులు 6,600పైగా నమోదు కాగా, ఇప్పటి వరకు 9 మంది మరణించారు.

## ఆన్‌లైన్ తరగతుల కోసం మార్గదర్శకాలు

బెంగళూరు, జూన్ 29: జూన్ నెల ముగిసిపోతున్నా కరోనా నేపథ్యంలో దేశవ్యాప్తంగా స్కూళ్లు తెరుచుకోలేదు. కొన్ని రాష్ట్రాల్లోని ప్రైవేట్ స్కూళ్లు ఇప్పటికే ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం దీనికి సంబంధించి సోమవారం పలు మార్గదర్శకాలు జారీ చేసింది. కిండర్‌గార్డెన్ నుంచి పదో తరగతి వరకు ఎంత సమయం, వారంలో ఎన్ని రోజులు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలి అన్నది స్పష్టంగా పేర్కొంది. కిండర్‌గార్డెన్ పిల్లలకు వారంలో 30 నిమిషాలు మాత్రమే ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలి. 1 నుంచి 5 తరగతుల వారికి వారంలో 30-45 నిమిషాల వరకు ఆన్‌లైన్‌లో బోధించవచ్చు. అయితే ఈ సమయాన్ని రెండు పిరియడ్స్‌గా విభజించి రోజు విడిచి రోజు చొప్పున మూడు రోజులపాటు నిర్వహించాలి. 5-8 తరగతుల విద్యార్థులకు వారంలో 30-45 నిమిషాలపాటు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించవచ్చు. అయితే ఈ సమయాన్ని రెండు పిరియడ్స్‌గా విభజించి వారంలో ఐదు రోజులపాటు బోధించాలి.

ఇక 9-10వ తరగతి విద్యార్థులకు వారంలో 30-45 నిమిషాలపాటు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలి. ఈ సమయాన్ని నాలుగు పిరియడ్స్‌గా విభజించి వారంలో ఐదు రోజులపాటు బోధించాలి. కర్ణాటక హైకోర్టు సూచనల మేరకు ఆన్‌లైన్ తరగతుల నిర్వహణకు సంబంధించి ఈ మార్గదర్శకాలను జారీ చేసినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.



# హరితహారం లక్ష్యం కోసం కృషి

### ఊరూ వాడా మొక్కలు నాటేలా ప్రోత్సాహం

జనగామ,జూన్29(ఆర్ఎన్ఎ): గతంలో హరితహారంలో దూసుకుపోఇన జనగామ జిల్లా అధికార యంత్రాంగం తాజా హరితహారం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 50 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించింది. గతంలో సీడ్ బాల్స్ విధానంతో మంచి ఫలితాలు సాధించారు. తాజాగా నేరుగానే మొక్కలు నాటేందుకు ఓ వైపు మంత్రి ఎర్రబెల్లి దయకార్ రావు, మరోవైపు కలెక్టర్ నిఖిల అధికారులను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్నారు. నాటిన మొక్కలను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను కోరారు. నాటిన మొక్కల వివరాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అందులో నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆమె ఆదేశించారు. గ్రామాల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో మనవంతు బాధ్యతను నెరవేర్చాలని కోరారు. ఇక ఆకుపచ్చని తెలంగాణెళి సీఎం కేసీఆర్ లక్ష్యమని, హరితహారాన్ని ఉద్యమంలా చేపట్టి విస్తృతంగా మొక్కలు నాటాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. పర్యావరణ హితానికే హరితహారం చేపట్టారని, మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారమని వివరించారు. హరితహారంలో రాష్ట్ర వ్యాప్తంగా 30వేల కోట్ల మొక్కలు నాటాలన్న లక్ష్యం పెట్టుకున్నామని, నాటిన మొక్కలన్నీ వందశాతం బతకాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఇందులో సర్పంచులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో చెట్టు నరికిన వారికి భారీ జరిమానా విధించాలని ఆదేశించిన మంత్రి, సర్పంచ్‌లు ప్రోత్సహించినా, విషయం తెలిసి వట్టించుకోకపోయినా పదవులు ఊడుతాయని హెచ్చరించారు. మంకీఫుడ్ కోర్టుల ద్వారా కోతులను గ్రామాల్లోకి రాకుండా చూడవచ్చని చెప్పారు. హరితహారానికి గ్రామ పంచాయతీల నుంచి 10శాతం నిధులు, ఉపాధి హామీ నిధులు కూడా వినియోగించుకోవాలని సూచించారు.




హరితహారంలో భాగంగా కామారెడ్డి జిల్లా గాంధారి ఎక్స్‌రోడ్ నుంచి బాన్సువాడ వరకు 48 కి.మీ.ల మేర మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

# మానవ మనుగడకు చెట్లు ముఖ్యం

### -హరితహారంలో పాల్గొన్న స్పీకర్ పోచారం

కామారెడ్డి,జూన్29(ఆర్ఎన్ఎ): మానవ మనుగడకు చెట్లు అతిముఖ్యమైనవని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణలో 33 శాతం అడవులను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని చెప్పారు. స్పీకర్ సోమవారం కామారెడ్డి జిల్లాలో పర్యటించారు. హరితహారంలో భాగంగా గాంధారి ఎక్స్‌రోడ్ నుంచి బాన్సువాడ వరకు 48 కి.మీ.ల మేర మొక్కలు నాటే కార్యక్రమం లో పాల్గొన్నారు. గాంధారి రోడ్డు కూడలి వద్ద మొక్కలు నాటారు. ఈ క్యాక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే సురేందర్ పాల్గొన్నారు. ఐదేండ్లుగా నాటిన మొక్కలను కాపాడుతూ, కొత్త మొక్కలు నాటాలని సూచించారు. హరిత హారం కార్యక్రమం ఆగస్టు వరకు కొనసాగుతుందని చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో అడవులు తగ్గిపోయాయని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 230 కోట్ల మొక్కలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇప్పటివరకు 172 కోట్ల మొక్కలు నాటామని, ఈ ఏడాది మరో 30 కోట్ల మొక్కలు నాటుతామని తెలిపారు. కామారెడ్డి జిల్లాలో ఈ ఏడాది 65 లక్షల మొక్కలు నాటనున్నామని ప్రకటించారు.

## భద్రతాపరమైన అనుమతులకు పోర్టల్

### ప్రారంభించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ,జూన్29(ఆర్ఎన్ఎ): వివిధ భద్రతా అనుమతుల కోసం ఒక కొత్త పోర్టల్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఢిల్లీలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తఈ కొత్త పోర్టల్‌ను ప్రారంభించారు. ఇకపై రక్షణ సంస్థల పరిధిలో చేపట్టే ప్రాజెక్టులకు సంబంధించిన భద్రతాపరమైన అనుమతుల కోసం సంబంధిత సంస్థలు ఈ వెబ్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేసిన ఈ కొత్త పోర్టల్, సెక్యూరిటీ క్లియరెన్స్ కోసం దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో తమ ప్రతిపాదనలను సమర్పించడానికి వీలు కల్పిస్తుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఆయా దరఖాస్తులను ప్రాసెస్ చేయడానికి వీలుగా రూపొందించిన ఈ ఆన్‌లైన్ వ్యవస్థ అత్యంత సమర్థవంతమైనదేగాక, వేగవంతం, పారదర్శకతతో కూడుకున్నదని పేర్కొన్నారు. రక్షణ సంస్థల పరిధితోపాటు భారత ప్రాంతీయ సముద్ర జలాలు, ఈఈజ్ ప్రాంతాల్లో చేపట్టే కార్యకలాపాలకు అవసరమయ్యే భద్రతాపరమైన అనుమతుల కోసం ఈ పోర్టల్ ఎంతో ఉపయోగపడుతుందని రక్షణ మంత్రిత్వశాఖ అధికారులు వెల్లడించారు.

# సచివాలయ నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

### పాత సచివాలయ కూల్చివేతను సమర్థించిన హైకోర్టు

### కూల్చొద్దంటూ వేసిన అన్ని పిటిషన్లను కొట్టేసిన ధర్మాసనం

హైదరాబాద్,జూన్29(ఆర్ఎన్ఎ): కొత్త సచివాలయ నిర్మాణానికి ఆటంకాలు తొలిగిపోయాయి. సచివాలయం కూల్చివేత వివాదంలో ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా హైకోర్టు తుది తీర్పు వెలువరించింది.

కూల్చివేతపై వేసిన పిటిషన్లంటినీ కోర్టు కొట్టివేసింది. మంత్రిమండలి నిర్ణయాన్ని తప్పుబట్టలేమని ధర్మాసనం పేర్కొంది.

ప్రస్తుత సచివాలయంలో వసతులు లేవని, పాలనకు అనుకూలంగా లేదన్న ప్రభుత్వ వాదనతో హైకోర్టు ఏకీభవించింది. ప్రస్తుతం ఉన్న సచివాలయాన్ని కూల్చివేసి కొత్త సచివాలయాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అలాగే గత జూన్‌లో సిఎం కెఇసార్ కొత్త సచివాలయానికి శంకుస్థాపన కూడా చేశారు.

అయితే మంత్రివర్గ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ నేతలు తదితరులు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలను దాఖలు చేశారు. వీటన్నింటిపై హైకోర్టులో సుదీర్ఘ వాదనలు కొనసాగాయి.

సచివాలయ నిర్మాణం అనేది విధాన పరమైన నిర్ణయమని.. ఇందులో కోర్టు జోక్యం చేసుకోవద్దంటూ ప్రభుత్వం వాదించింది. ప్రస్తుతం ఉన్న సచివాలయం అవసరాలకు సరిపోవడం లేదని ప్రభుత్వం కోర్టు దృష్టికి తీసుకువచ్చింది.

మరోవైపు వందల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ప్రస్తుతం ఉన్న సెక్రటేరియట్ శిధిలావస్థకు చేరుకోవడంతో.. మరో కొత్త సెక్రటేరియట్ నిర్మించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అందుకు విరుద్ధంగా కొంతమంది కోర్టును ఆశ్రయించారు. ఆ కేసుకు సంబంధించి హైకోర్టు ఈ తీర్పు చెప్పింది.

## వరంగల్ నగరంలో దారుణం

### -భార్యాకూతుళ్లను హతమార్చిన తాగుబోతు

వరంగల్,జూన్29(ఆర్ఎన్ఎ): తాళి కట్టిన భార్యను చంపేశాడు.. ఆ తరవాత ఈ హత్యను చూసిందన్న కారణంతో కన్న కూతుర్నీ కర్కశంగా గొంతు నులిమి హతమార్చాడో తండ్రి. ఈ దారుణ ఘటన వరంగల్ నగరంలోని ఉర్సు గుట్ట ప్రాంతంలో ఆదివారం చోటు చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. స్థానిక బీఆర్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ప్రైవేట్ ఉద్యోగి. పదేళ్ల కిందట రమ్య (29)తో వివాహమైంది. వ్యాపారాల పేరుతో అప్పులు చేసి ఆర్థికంగా చితికిపోయి తాగుడుకు బానిసయ్యాడు. నిత్యం భార్యతో గొడవ పడుతూ ఆమెను ఇబ్బందులకు గురి చేసేవాడు. ఈ క్రమంలో కొద్ది రోజులు కిందట పుట్టింటికి వెళ్లిన భార్యను తనప్రవర్తన మార్చుకుంటానని నమ్మించి తిరిగి తీసుకొచ్చాడు. ఆదివారం ఉదయం మద్యం మత్తులో ఉన్న వెంకటేశ్వర్లు రమ్యతో గొడవపడ్డాడు. గొంతు నులిమి హత్య చేశాడు. ఈ దారుణాన్ని చూసిందన్న కారణంతో కుమార్తె మనస్విని(8)ని కూడా గొంతు నులిమి హత్య చేశాడు. రోజూ ఉదయమే కనిపించే రమ్య మధ్యాహ్నమైనా ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు వెళ్లి చూడగా తల్లీకూతురు అచేతనావస్థలో కనిపించారు. వెంటనే ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు

## హరితహారాన్ని సమిష్టిగా విజయవంతం చేద్దాం : మంత్రి ఎర్రబెల్లి

జనగామ, జూన్ 29: జిల్లాలోని స్టేషన్ ఘన్ పూర్ మండలం తాటికొండలో పలు గ్రామాల్లో హరితహారంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు. గ్రామ చెరువు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేసి మంత్రి మాట్లాడారు. తాటికొండ చారిత్రక ప్రాంతం. ఇక్కడ సర్వాయి పాపన్న రాజ్యాన్ని పరిపాలించారన్నారు. ఇక్కడ హరితహారంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

జిల్లాలో ఈ ఏడాది 52 లక్షల మొక్కలు నాటాలి. వివిధ నర్సరీల్లో 65.92 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అందరూ మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కరోనా విస్తృతి నేపథ్యం లో అంతా జాగ్రత్తగా ఉంటూ స్వీయ నియంత్రణ పాటించాలి ప్రజలకు సూచించారు.

## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో అంతర్జాతీయస్థాయిలో జిమ్ ప్రారంభం

కరీంనగర్, జూన్ 29 (నేటినిజంప్రతినిధి):కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో అంతర్జాతీయస్థాయిలో అత్యాధునిక సౌకర్యాలు, పరికరాలతో ఏర్పాటు చేసిన జిమ్(వ్యాయామశాల)ను సిఐడి ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజిపి) పి ప్రమోద్‌కుమార్ సోమవారం నాడు ప్రారంభించారు. ఒకనెల వ్యవధిలోనే అత్యాధునిక సౌకర్యాలు, పరికరాలతో ఈజిమ్‌ను ఏర్పాటు చేశారు.

పోలీసులు దేహదారుఢ్యాన్ని కాపాడుకోవడంతోపాటు, రోగనిరోధకశక్తిని పెంపొందించుకునేందుకుగాను ఈ జిమ్‌ను ఏర్పాటు చేశారు. జిమ్‌లోని వివిధ విభాగాలను పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి, జిల్లాకలెక్టర్ కె శశాంక, మున్సిపల్ కమిషనర్ క్రాంతిలు ప్రారంభించారు. ట్రెడిల్, క్రాస్‌ట్రైనర్, స్ప్రింగ్‌బైట్, వివిధ రకాల సైకిల్స్, లాడ్స్‌పుల్స్, బటర్‌ఫ్లై, స్మీత్‌మిషన్, కేబుల్‌క్రాస్‌ఓవర్,లెగ్‌ప్రెస్, లెగ్‌కట్స్‌లతోపాటు వివిధ రకాల పరికరాలు, వ్యాయామం చేస్తున్నప్పుడు ఏక్రాగ్రత కొనసాగడంతోపాటు, ప్రోత్సాహాన్నిచ్చేందుకు సౌండ్‌సిస్టమ్‌లను ఏర్పాటు చేశారు. అంతర్జాతీయస్థాయిలో ఉండే విధంగా వివిధరకాల డిజైన్లతో ఈ జిమ్ ఏర్పాటుకాబడింది.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఐజి ప్రమోద్‌కుమార్ కుమార్ మాట్లాడుతూ పోలీసులు రోగనిరోధకశక్తిని పెంపొందించుకోవడంతోపాటు, దేహదారుఢ్యాన్ని కాపాడుకునేందుకు వ్యాయామాలను చేయాలన్నారు. ప్రస్తుతం నెలకునిఉన్న విపత్కర పరిస్థితులలో రోగనిరోధకశక్తిని పెంపొందించుకోవడం తప్పనిసరని, వ్యాయామాలను దినచర్యలో భాగంగా అలవర్చుకోవడం ద్వారా సంపూర్ణఆరోగ్యంతో విధినిర్వాహణకు మానసికంగా,శారీరకంగా సంసిద్దంగా ఉంటామనే విషయాన్ని అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు గుర్తించాలని చెప్పారు.

పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సౌకర్యాలు, అంతర్జాతీయస్థాయి పరికరాలతో ఈ జిమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. పోలీసులు పదవి విరమణ పొందేంతవరకు దేహదారుఢ్యాన్ని కాపాడుకోవడంద్వారానే సమర్థవంతంగా విధులను కొనసాగించవచ్చని చెప్పారు. వివిధ రకాల వ్యాయామాలను దినచర్యలో భాగంగా అలవర్చుకోవడం తమబాధ్యతగా గుర్తించాలని పేర్కొన్నారు. నిర్ణీత సమయంలోపే అన్నిరకాల పరికరాలు,సౌకర్యాలతో ఏర్పాటయ్యేందుకు కృషిచేసిన అధికారులను అభినందించడంతోపాటు వారిని సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), ఏసిపి అశోక్, ఎస్‌బిఐ ఇంద్రసేనారెడ్డి, ఇన్స్‌పెక్టర్లు విజయ్‌కుమార్, లక్ష్మణ్‌బాబు, తుల శ్రీనివాసరావు, నటేష్, శశిధర్‌రెడ్డి, ఆర్ఐలు మల్లేశం, జానిమియా, శేఖర్, మురళీ, కాంట్రాక్టర్ మధుసూధన్‌రాజు, ఉదయ్, జిమ్ ఇంఛార్జి యం సామ్రాట్, జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ దామోదర్‌లతోపాటుగా వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దేశ సరిహద్దులపై రాజకీయాలా?

### -కేంద్రం తీసుకున్న నిర్ణయాలను సమర్థించిన మాయావతి

న్యూఢిల్లీ,జూన్29(ఆర్ఎన్ఎ): భారత్ - చైనా సరిహద్దు వివాదంపై బిజెపి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను బిఎస్పీ అధినేత్రి మాయావతి సమర్థించారు. తమది బీజేపీ స్టాండేనని మాయావతి అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సరిహద్దు వివాదంపై కాంగ్రెస్, బీజేపీ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని, ఇది ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. చైనా విషయంలో కఠినంగానే వ్యవహరించాలన్నారు. దేశ సరిహద్దుల విషయంలో రాజకీయాలు తగవన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలు, ఆదివాసీలు, మైనారిటీల కోసమే బీఎస్పీ ఆవిర్భవించిందన్నారు. పార్టీ ఏర్పడినప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉందని, ఆయా వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం ఏదైనా చేసి ఉంటే బీఎస్పీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. బీఎస్పీ ఎవరి చేతులో బొమ్మ కాదని బీజేపీ, కాంగ్రెస్‌లకు చెప్పాలనుకుంటున్నానన్నారు. ఇది జాతీయ స్థాయిలో ఏర్పడిన స్వతంత్ర పార్టీ అని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌పై దాడిని కొనసాగిస్తూ కరోనా వైరస్ సంక్రమణ క్రమంలో తమ స్వరాష్ట్రానికి తిరిగి వచ్చిన వలసదారులు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇతర రాష్ట్రాలకు వెళ్లారని గుర్తు చేశారు. కాంగ్రెతస్ వారికి ఏదైనా చేసి ఉంటే వారు ఉపాధి కోసం వివిధ రాష్ట్రాలకు వెళ్లి ఉండేవారు కాదని విమర్శించారు. బీజేపీ వాటిని పునరావృతం చేయొద్దని సూచించారు. దేశాన్ని 'ఆత్మ నిర్భర్'గా చేయడానికి కష్టపడాలని, ప్రచారం పెద్దగా చేయొద్దని సూచించారు. అలాగే దేశంలో ఇంధన ధరల పెంపును నియంత్రించాలని కేంద్రాన్ని కోరారు. ఒక వైపు కరోనా మహమ్మారి కారణంగా పౌరులు కలవరపడుతున్నారని, మరో వైపు పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సమస్యలను పెంచిందన్నారు.

## ఎంతగా కృషి చేసినా కంట్రోల్ కావడం లేదు

### -కరోనా విస్తృతిపై మంత్రి ఎర్రబెల్లి నిర్వేదం

జనగామ,జూన్29(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో తకరోనా వైరస్ వ్యాప్తి నివారణకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, కంట్రోల్ చేసినా అనేక కారణాల వల్ల వ్యాధి విస్తృతి తగ్గడం లేదని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అంటువ్యాధులు రావొద్దంటే గ్రామాల్లో పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రతిరోజూ పారిశుద్యం చేయాలన్నారు. సోమవారం జిల్లాలోని స్టేషన్‌గణపూర్ మండలం తాటికొండలో హరితహారంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే రాజయ్యతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామ రైతువేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తర్వాత గ్రామ చెరువు నుంచి ఆయుకట్టుకు నీటిని విడుదల చేశారు. తర్వాత పలు సీసీరోడ్లనిర్మాణానికి కూడా మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాటికొండ చారిత్రక ప్రాంతం. ఇక్కడ సర్వాయిపాపన్నరాజ్యం చేసిన నేల. జనగామ జిల్లాలో ఈ ఏడాది 52లక్షల మొక్కలు నాటాలని అన్నారు. వివిధ నర్సరీల్లో 65.92 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. 562 కి.మీ. మేర రోడ్లకు ఇరు వైపుల మొక్కలు నాటనున్నట్టు తెలిపారు. అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూకృషి చేయాలన్నారు. కరోనా విస్తృతి నేపథ్యంలో అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. స్వీయ నియంత్రపాటించడంతో పాటు ఎవరికి వారు లాక్‌డౌన్‌ను పాటించాలని మంత్రి పేర్కొన్నారు. పేదల కోసం పోరాటాలు చేసిన నేతల గడ్డలో అద్భుతమైన పార్కును అభివృద్ధి చేయాలన్నారు. అడవులు అంతరించి పోవడం వల్ల కోతులు మన గ్రామాలకు వస్తున్నాయన్నారు. అందుకే ఇక్కడ మంకీ ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిఖిల, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌వ్యాప్తంగా మాజీ ప్రధాని పివి శతజయంతోత్సవ కార్యక్రమాలు

కరీంనగర్, జూన్ 29 (నేటినిజంప్రతినిధి):ఢిల్లీకి రాజైనా తల్లికొడుకునే అన్న నాటి మాజీ ప్రధాని కరీంనగర్ ఉమ్మడిజిల్లా వంగర గ్రామానికి చెందిన దివంగత పివి నర్సింహారావు శతజయంతోత్సవ కార్యక్రమాలు కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం నాడు కమిషనరేట్‌వ్యాప్తంగా జరిగాయి. కమిషనరేట్ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ భారత ఆర్థికవ్యవస్థ పతనావస్థలో ఉన్న సందర్భంలో మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేళ్లపాటు కొనసాగించడంతోపాటు దేశ ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న మహోన్నతుడన్నారు. పివి హయాంలో ప్రవేశపెట్టబడిన ఆర్థికసంస్కరణలతో మనం ఆర్థికంగా పుంజుకున్నామని చెప్పారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన పివి నర్సింహారావు కరీంనగర్ ఉమ్మడిజిల్లా ప్రాంతంలో జన్మించడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), ఏసిపి మదన్‌లాల్, ఎస్‌బిఐ ఇంద్రసేనారెడ్డి, ఆర్ఐలు మల్లేశం, జానిమియా, మురళీ,శేఖర్, ఇన్స్‌పెక్టర్లు శ్రీధర్, నటేష్, సిపివో కార్యాలయం(పరిపాలన) అధికారులు, వివిధ విభాగాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

ఏసిపి కార్యాలయాల్లో

కరీంనగర్‌టౌన్, కరీంనగర్ రూరల్, హుజురాబాద్,కరీంనగర్‌ట్రాఫిక్ ఏసిపి కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఏసిపిలు పి అశోక్, విజయసారధి, ఎస్ శ్రీనివాసరావు, శంకర్‌రాజు, వివిధ విభాగాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో.....

కమిషనరేట్‌లోని కరీంనగర్ వన్‌టౌన్,టూటౌన్,త్రీటౌన్, కరీంనగర్‌రూరల్, గంగాధర, రామడుగు, గన్నేరువరం, గంగాధర, కేశవపట్నం, సైదాపూర్, కొత్తపల్లి పోలీస్‌స్టేషన్లలో జరిగిన కార్యక్రమాల్లో అధికారులు విజయ్‌కుమార్, లక్ష్మణ్‌బాబు, విజ్ఞాన్‌రావు, తుల శ్రీనివాసరావు, వివేక్, గొల్లపల్లి అనూష, తిరుపతి, వివేక్, వి రవి, ప్రశాంత్, ఎల్లయ్యగౌడ్‌లతోపాటుగా వివిధ విభాగాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

సిపిటిసిలో.....

సిటిపోలీస్ శిక్షణకేంద్రం(సిపిటిసి)లో జరిగిన కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ శివభాస్కర్, ఇండోర్, అవుట్‌డోర్ విభాగాల ఇంఛార్జిలు నాగేందర్, కిరణ్‌కుమార్‌లతోపాటు వివిధ విభాగాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

పిటిసిలో.....

కరీంనగర్‌లోని పోలీసు శిక్షణ కళాశాల (పిటిసి)లో మాజీప్రధాని పివి నర్సింహారావు జయంతోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎస్పి చంద్రయ్య, ఇండోర్ (పరిపాలన) ఇన్స్‌పెక్టర్ సిహెచ్ హనోక్, ఆర్ఐలు రమేష్,సురేష్, విష్ణుప్రసాద్, త్రిమూక్, శ్రీనివాస్‌లతోపాటు వివిధ విభాగాలకు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

## మరో 77 మంది పోలీసులకు కరోనా

ముంబై,జూన్ 29: మహారాష్ట్రలో మరో 77 మంది పోలీసులకు కరోనా సోకింది. దీంతో ఆ రాష్ట్రంలో కరోనా వైరస్ బారినపడిన పోలీసుల సంఖ్య 1,030కి చేరింది. మరోవైపు ఆదివారం నుంచి సోమవారం వరకు గత 24 గంటల్లో కరోనా వల్ల ఇద్దరు పోలీసులు మరణించారు. దీంతో వైరస్ బారినపడి చనిపోయిన పోలీసుల సంఖ్య 59కి చేరింది. మహారాష్ట్రలో కరోనా కేసుల తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్నది. కరోనాపై పోరాటంలో ముందున్న పోలీసులు కూడా వైరస్ మహమ్మారి బారినపడుతున్నారు. ఇప్పటికే వెయ్యి మందికిపైగా పోలీసులకు కరోనా పాటిజివ్‌గా నిర్ధారణ అయ్యింది. వీరిలో సుమారు 60 మంది మరణించారు. ఈ నేపథ్యంలో ముంబై పోలీసుశాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలున్న పోలీసులకు వైద్యసేవల కోసం మూడు ప్రత్యేక ఐసోలేషన్ కేంద్రాలను ఇటీవల ప్రారంభించింది.

# ప్రతి ఎకరానికి సాగునీరు : మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి, జూన్ 29: సాగుకు యోగ్యమయ్యే ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తామని వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెద్దగూడెంలో వైకుంఠధామాన్ని ప్రారంభించి, ఖాన్ చెరువుకు నీళ్లు నింపే లిఫ్ట్ పనులకు మంత్రి భూమిపూజ చేసి మాట్లాడారు. పెద్దగూడెం కల నెరవేరింది. మాట ఇచ్చా .. నిలబెట్టుకుంటున్నానని మంత్రి తెలిపారు. 1500 ఎకరాలకు సాగు నీరు, దాదాపు 400 మంది రైతులకు దీంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. రూ. 79 లక్షలతో 120 హెచ్ పీ మోటారుతో ఖాన్ చెరువు నింపేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఖాన్ చెరువు నింపి రాములవారి పాదాలు కడుగుతానన్నారు. విపక్ష నేతలు ఫిర్యాదులతో నీళ్లు రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. రైతుల శ్రేయస్సే ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో గానో కృషి చేస్తున్నారని తెలిపారు.

# కేబీఆర్ పార్కులో ఎంట్రీ ప్లాజా ఏర్పాటు

### లాంఛనంగా ప్రారంభించిన మంత్రి ఇంద్ర

హైదరాబాద్,జూన్29(ఆర్ఎన్ఎ): ఆరో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఇవాళ కేబీఆర్ పార్క్ లో మొక్కలు నాటారు. అనంతరం పార్క్ లోని ఎంట్రీ ప్లాజాను ప్రారంభించి మాట్లాడారు. కొవిడ్ -19 ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో సందర్శకుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక ముందుస్తు జాగ్రత్తల్లో భాగంగా ఎంట్రీ ప్లాజాను ఏర్పాటు చేశామన్నారు. టికెట్ కౌంటర్ వద్ద భౌతిక దూరం పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఎంట్రీ బ్యారియర్స్‌ను మార్చి, కొత్తగా స్వింగ్ బ్యారియర్స్ ను ఏర్పాటు చేసి ఓపెనింగ్, క్లోజింగ్ ఎంట్రీ వద్ద పేషియల్ డిటెక్షన్ అమర్చారు. ఫిజికల్లీ ఛాలెంజ్డ్ పర్సన్స్ కోసం ర్యాంప్ సౌకర్యం కల్పించారు. అర్బన్ ఫారెస్ట్ పార్క్ థీమ్ లాగా ఎంట్రీ ఎ÷-లాజా వద్ద పీకాక్ బేస్ట్ థీమ్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. సందర్శకులు, వాకర్స్ భద్రతలో భాగంగా పార్క్ అంతటా కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు, మానిటరింగ్ చేస్తున్నాం. ఇక్కడ ఉన్న జంతువులు, పక్షి జాతుల్లో ఎక్కువగా జాతీయ పక్షి నెమలి ఉండటంతో, కేబీఆర్ జాతీయ ఉద్యానవనం ఏర్పాటుకు గుర్తుగా ప్రతీయేటా నవంబర్ 3న అటవీ శాఖ పీకాక్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నది పేర్కొన్నారు. కేబీఆర్ పార్క్ మూసివేయడంతో సందర్శకుల పాస్ రెన్యూవల్ తేదీని సెప్టెంబర్ వరకు పొడిగిస్తామన్నారు. దీనికి ఎలాంటి అదనపు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని వివరించారు. సందర్శకులు తమ పాసులను అక్టోబర్, 2020 నుంచి ఆన్ లైన్ ద్వారా రెన్యువల్ చేసుకోవచ్చు. హరితహారంలో అందరూ పాల్గొని తప్పనిసరిగా మొక్కలు నాటాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.




హైదరాబాద్ కెబిఆర్ పార్క్ లోని ఎంట్రీ ప్లాజాను ప్రారంభించిన మంత్రి ఎ. ఇంద్రకరణ్ రెడ్డి.

# పక్కా వ్యూహంతో జగన్ పథక రచన

### ఓటి÷- బ్యాంక్ పటిష్టపరిచేలా కార్యాచరణ
### ఆర్థికస్థితి అంతంతగా ఉన్నా డబ్బుల పందేరం
### వచ్చే నాలుగేళ్లకు ఇప్పటినుంచే పునాదులు
### పథకాల అమలు వెనక జగన్ పటిష్ట వ్యూహం

అమరావతి,జూన్29(ఆర్ఎన్ఎ): దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి బాటలోనే ప్రస్తుత సిఎం, ఆయన తనయుడు వైఎస్ జగన్మోమన్ రెడ్డి కూడా వివిధ పథకాలతో ప్రజలను ఓటుబ్యాంక్‌గా మార్చుకునే యత్నంలో పడ్డారు. వచ్చే నాలుగేళ్లకు ఇప్పటి నుంచి కార్యాచరణ మొదలయ్యిందని రాజకీయ విశ్లేషకులు సైతం అంగీకరిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ, పథకాల అమలు విషయంలో వెనకడుగు వేయడం లేదు. పక్కావ్యూహంతో ఒక్కో పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా డబ్బుల పంపిణీ కార్యక్రమాలకే పెద్దపీట వేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుమతించక పోయినా ప్రజాధనాన్ని పంచిపెట్టే కార్యక్రమాన్ని కొనసాగించాలన్న పట్టుదలలో ఉన్నారు. దివంగత వైఎస్ కూడా ఇలాగే ప్రజల్లో మంచి పేరు సంపాదించారు. అదే ఆయనను ఉమ్మడి ఎపిలో రెండోసారి అధికారంలోకి తీసుకుని వచ్చింది. అలాగే ఇప్పుడు జగన్ కూడా తండ్రి బాటలో పయనించి ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలనీ భావిస్తున్నట్లుగా ఉంది. పథకాల అమలుతోపాటు సోషల్ ఇంజనీరింగ్ ద్వారా బలమైన ఓటు బ్యాంకును నిర్మించుకోవడానికి జగన్ పావులు కదుపుతున్నారు. ఉన్నతవర్గాలు తనకు దూరమైనా ఫర్వాలేదనీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు రెడ్డి సామాజికవర్గం అండదండలు దండిగా ఉండేలా పథకాల అమలు కొనసాగుతోంది. తెలుగుదేశం పార్టీని ఇప్పటికే దెబ్బకొట్టిన జగన్ అదే మంత్రంతో ముందుకు సాగుతున్నారు. ఆయా సామాజికవర్గాల మద్దతు తనకు లభించేలా చూస్తున్నారు. హామీల అమలు పేరిట ప్రజాధనాన్ని జగన్మోహన్‌రెడ్డి పంచిపెడుతున్నారనీ ఇప్పటికే విమర్శలు వస్తున్నా జగన్ మాత్రం లెక్క చేయడం లేదు. దీనివల్ల ప్రజలలో తనకు మంచి పేరు వస్తుందన్న ధీమాలో ఆయన ఉన్నారని ప్రచారం. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను గమనించేవారికి పాలనలో పెద్దగా మార్పు కనిపించకున్నా పథకాల పేరుతో పందేరం సాగుతోందని విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉన్న పుటికీ, పథకాల అమలు విషయంలో వెనకడుగు వేయకపోవడంలో జగన్మోహన్‌రెడ్డికి పక్కా వ్యూహం ఉందని చెబుతున్నారు. పటిష్టమైన ఓటు బ్యాంక్‌ను నిర్మించుకోవడమే ఈ పథకాల అమలు వ్యూహమని రాజకీయ విశ్లేషకులు సైతం అంగీకరిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుమతించకపోయినా ప్రజాధనాన్ని పంచిపెట్టే కార్యక్రమాన్ని కొనసాగించాలనీ, తద్వారా ప్రజలలో మంచి పేరు తెచ్చుకోవాలనీ జగన్ భావిస్తున్నారని అంటున్నారు. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ఉన్నా మరో ఏడాది తర్వాత పథకాల అమలుకు నిధులు ఉండవన్న ప్రచారం కూడా సాగుతోంది. మరోవైపు కెసిఆర్ మాయలో పడి తెలంగాణలో అమలు చేస్తున్న పథకానలు కాపీ కొడుతున్నారనన్న విమర్శలు కూడా ఉన్నాయి. పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్ పట్టించుకోవడం లేదనీ సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులను ఇలాగే కొనసాగిస్తూ పోతే జీతాలు చెల్లించడానికి కూడా నిధులు ఉండవనీ అంటున్నారు. ఇప్పటికే కరోనా కారణంగా ఆర్థికస్థితి పూర్తిగా దెబ్బతింది. అయినా పథకాల కోసం నిధుల విడుదల ఆగడం లేదు. ఏ కులాన్ఇన, మతాన్ని వదలకుండా ఇప్పటి వరకు అన్ని వర్గాలకు ఆర్థికంగా లబ్ధి చేకూరేలా కార్యక్రమాలను చేపట్టారు.

## పరిశ్రమలకు రెండో విడత సాయం విడుదల

### రూ.512 కోట్లను విడుదల చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
### వ్యవసాయం తరవాత పరిశ్రమలే పెద్ద బాధ్యతని వ్యాఖ్య

అమరావతి,జూన్29(ఆర్ఎన్ఎ): కరోనా విపత్తు సమయంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకునేందుకు రూ. 1,168 కోట్లతో రీస్టార్ట్ ప్యాకేజీని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రాయితీ బకాయిలను సోమవారం విడుదల చేసింది. రిస్టార్ట్ ప్యాకేజీలో భాగంగా మే నెలలో రూ.450 కోట్లను మే నెలలో విడుదల చేయగా, సోమవారం రూ.512 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. అందుకు అనుగుణంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రెండో విడత బకాయిలను సోమవారం సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. చిన్న పరిశ్రమలకు తోడుగా ఉంటేనే వారి కాళ్లమీద వాళ్లు నిలబడటంతో పాటు కొంతమందికి ఉద్యోగాలు ఇవ్వగల్గుతారని పేర్కొన్నారు. దాదాపు లక్ష సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 2014-15 నుంచి గత సర్కారు రూ.827.5 కోట్ల మేర బకాయిలు పెట్టింది. టీడీపీ సర్కారు బకాయిలతో పాటు ఈ ఏడాది రాయితీలు కూడా కలిపి రూ. 962.62 కోట్లను రెండు విడతలుగా చెల్లించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మే నెలలో తొలివిడతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 450.27 కోట్లను విడుదల చేశారు. మిగతా బకాయిలను జూన్ 29వ తేదీన విడుదల చేస్తామని అదే రోజు ఆయన ప్రకటించారు. వ్యవసాయరంగం తర్వాత ఉపాధి కల్పించే రంగం ఎంఎస్‌ఎంఈలదే అని సీఎం అన్నారు. గత ప్రభుత్వం రూ. 800 కోట్లను బకాయిలుగా పెట్టిందని, వాటన్నింటిని తమ ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. కరోనా వల్ల పరిశ్రమలు నడపలేని పరిస్థితుల్లో వెసులుబాటు ఇచ్చేందుకు ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో కరెంటు ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ. 180 కోట్లు మాఫీ చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఏపీఎస్ఎఫ్‌సీ ద్వారా రూ. 200 కోట్లతో పెట్టుబడి రుణాలను తక్కువ వడ్డీకే అందిస్తున్నామని చెప్పారు. రుణాలకు 6 నెలల మారటోరియంతో పాటు మూడేళ్ల కాలపరిమితిలో చెల్లించే అవకాశం కల్పించామని చెప్పారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల నుంచి 25శాతం ప్రభుత్వమే

కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సీఎం జగన్ వెల్లడించారు. స్పిన్నింగ్ మిల్లులకు సబంధించిన రూ. 1000 కోట్ల బకాయిలను వచ్చే ఏడాదిలో చెల్లిస్తామన్నారు. ఎంఎస్‌ఈలకు సంబంధించి బాగోగులు చూసేందుకు ఓ జేసిని పెడుతామన్నారు. పనుల కోసం అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా చూస్తామన్నారు. ఎంఎస్‌ఈల పనులపై జేసీలు దృష్టిపెట్టేలా కలెక్టర్లులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు వీరికి చేయూత నిచ్చేలా పనిచేయాలని, అప్పుడే నలుగురికి ఉద్యోగాలు వస్తాయని సీఎం జగన్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతం రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తో ట్రైనీ ఐఏఎస్‌ల భేటీ

### -వివిధ కార్యక్రమాలపై ప్రజెంటేషన్

అమరావతి,జూన్29(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో ట్రైనీ ఐఏఎస్ అధికారులు సోమవారం క్యాంపు కార్యలయంలో భేటీ అయ్యారు. ముస్సోరీలో రెండో విడత శిక్షణ కరోనా కారణంగా నెల రోజుల పాటు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ట్రైనీ ఐఏఎస్‌లకు వివిధ శాఖలను కేటాయించారు.

ఆయా శాఖల్లో అంశాలను, విధానాలను తెలుసుకునేందుకు ఈ కాలాన్ని ట్రైనీ ఐఏఎస్‌లు వినియోగించుకున్నారు. ఆ శాఖలపై ప్రజంటేషన్లు తయారు చేశారు. కొన్ని ఎంపిక చేసిన వాటిపై ట్రైనీ ఐఏఎస్‌లు సీఎంకు ప్రజెంటేషన్ అందజేశారు. ప్రజంటేషన్లు ఇచ్చిన ట్రైనీ ఐఏఎస్‌లు కేటన్ గార్గ్, విదేఖరే, ప్రతిష్ఠలను సీఎం అభినందించారు. వారిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ, 'కేటాయించిన శాఖల్లో అవగాహన పెంచుకోవాలి. అనుభవం సంపాదించాలి. ప్రతి వ్యవస్థల్లో లోపాలు కనిపిస్తుంటాయి, వాటిని ఎప్పటికప్పుడు సరి చేసుకుంటూ ముందడుగులు వేసి వాటిని దృఢంగా తీర్చిద్దాల్సిన అవసరం ఉంటుంది. ప్రభుత్వంలో అనుభవజ్ఞులైన అధికారులు ఉన్నారు, వారి మార్గ నిర్దేశరలో పనిచేయాలి' అని అన్నారు.

## ఎపిలో మరో 706 కేసులు నమోదు

అమరావతి,జూన్29(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో కొత్తంగా మరో 706 కరోనావైరస్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వీటితోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిలో 81మందికి, విదేశాల నుంచి వచ్చిన ఆరుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ మేరకు సోమవారం ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ కరోనా హెల్త్ బులిటెన్ విడుదల చేసింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 30,216 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా, మొత్తం 793 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 13,891కి చేరింది. ఇక గడచిన 24 గంటల్లో 302మంది కరోనా నుంచి కోలుకొని డిశ్చార్జ్ కాగా, 11 మంది మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 180కి చేరింది. ఈ రోజు మృతి చెందిన 11 మందిలో కర్నూలు 5, కృష్ణా 2, నెల్లూరులో 2, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్కొక్కరు ఉన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 7479 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

## తెరుచుకోనున్న మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దేవాలయం

హైదరాబాద్,జూన్29మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దేవాలయం : కరోనా మహమ్మారి కరాళ నృత్యం చేస్తున్న నేపథ్యంలో కరోనాను కట్టడి చేయడానికి ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ కారణంగా అన్ని దేవాలయాలు మూత పడిన విషయం తెలిసిందే. కాగా ప్రభుత్వం లాక్ డౌన్ సడలింపులు ఇవ్వడంతో కొన్ని ఆలయాలను తెరచి భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నప్పటికీ, మరి కొన్ని ఆలయాలు ఇంకా తెరచుకోకుండానే ఉన్నాయి. ఆ ఆలయాల జాబితాలో మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠం కూడా ఒకటి. రాష్ట్రంలో కరోనా కేసులు సంఖ్య రెట్టింపు అవుతున్న నేపథ్యంలో మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠం అధికారులు ఇప్పటివరకు ఆచితూచి అడుగులు వేశారు. జులై 2వ తేదీ నుంచి దర్శన భాగ్యం కల్పించాలని నిర్ణయించినట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దేవాదాయశాఖ మార్గదర్శకాలను అనుసరిస్తూ తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. పదేళ్లలోపు, 65 ఏళ్లు పైబడినవారు, గర్భిణులు, కంటైన్‌మెంటు జోన్ల నుంచి వచ్చేవారు మినహా అందరికీ అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆలయానికి వచ్చే భక్తులకు ముందుగా థర్మల్ స్క్రీనింగ్ చేసిన తర్వాత కొవిడ్ లక్షణాలు లేనివారినే అనుమతిస్తామని స్పష్టం చేశారు. అన్నవితరణ, ప్రసాదాల పంపిణీలు ప్రస్తుతానికి లేవన్నారు. ఆర్జిత సేవలు పరోక్షంగా నిర్వహిస్తామని, గర్భగుడి దర్శనాలు లేవన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మాత్రమే దర్శనాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు దర్శనాలకు వచ్చే భక్తుల కోసం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.



## కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు

### రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం లేకపోవడంతో బాధ
### మండిపడ్డ మంత్రిముక్తార్ అబ్బాస్ నఖ్వీ

న్యూఢిల్లీ,జూన్29(ఆర్ఎన్ఎ): కేంద్రంపై ప్రతిరోజూ విమర్శల వర్షం కురిపిస్తున్న కాంగ్రెస్‌కు కేంద్ర ప్రభుత్వం గట్టి కౌంటర్ ఇచ్చింది. కేంద్రంలో సమర్థవంతమైన, దృఢమైన ప్రభుత్వాన్ని చూసి కాంగ్రెస్ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోందని కేంద్ర మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ మండిపడ్డారు. కేంద్రంలో రిమోట్ కంట్రోల్' ప్రభుత్వం కాదని, అందుకే కాంగ్రెస్ బాధపడుతోందని ఎద్దేవా చేశారు. 'మిడిమిడి జ్ఞానం' తో కాంగ్రెస్ ప్రతిరోజూ కేంద్రంపై లేనిపోని విమర్శలు చేస్తోందని సోమవారంనాడిక్కడ ఆయన మండిపడ్డారు. తాము ఎంతో నేర్చుకున్నామని అనుకునే భ్రమలో కాంగ్రెస్ ఉందని, ఈ భ్రమలో ఉంటూనే పార్టీని నాశనం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఇప్పటికీ కాంగ్రెస్ పక్షపాత భూస్వామ్య మనస్తత్వం, అహంకారం అన్న లక్షణాలతోనే బాధపడుతోందని ఎద్దేవా చేశారు. ఎన్ని రోజులైనా ఒకరి స్వభావాన్ని మరొకరు మార్చలేరు. కాంగ్రెస్ వారు ప్రతిరోజూ సంకుచిత, అజ్ఞాన మనస్తత్వంతో జాతీయ భద్రత, ఆర్థిక వ్యవస్థ, రైతుల సమస్యలపై ఆదేశాలివ్వడానికి ప్రయత్నిస్తున్నారు. కేంద్రంలో ఉన్న సమర్థవంతమైన ప్రభుత్వాన్ని, రిమోట్ కంట్రోల్ కాని ప్రభుత్వాన్ని చూసి కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందంటూ తీవ్రంగా మండిపడ్డారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశ భద్రతకు, శ్రేయస్సు కోసమే అంకితమైందని, దేశం ప్రథమం అన్న మంత్రంతోనే ముందుకు సాగుతోందని నఖ్వీ తెలిపారు.

# స్కూళ్ల ప్రారంభంపై 5 తరవాత నిర్ణయిస్తాం

## -కర్నాటక మంత్రి సురేశ్ కుమార్

బెంగళూరు,జూన్29(ఆర్ఎన్ఎ): స్కూళ్లు తెరవవడంపై జూలై 5 తర్వాత నిర్ణయిస్తామని కర్ణాటక విద్యాశాఖ మంత్రి ఎస్ సురేశ్ కుమార్ తెలిపారు. ఆ రాష్ట్రంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల నిర్వహణను సోమవారం ఆయన పరిశీలించారు.

అనంతరం మంత్రి సురేశ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ... పదో తరగతి పరీక్షలు ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయని, ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. కర్ణాటకలో స్కూళ్లను పునరుద్ధరించే అంశంపై ఆయన మాట్లాడారు. ఒకటి నుంచి పదో తరగతి తరగతుల నిర్వహణకు కేంద్రం పలు మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో గతంలో ప్రభుత్వం అనుసరించిన విధానంతోపాటు కేంద్రం మార్గదర్శకాలను పరిశీలించేందుకు నిపుణులతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు సురేశ్ కుమార్ చెప్పారు. ఆ కమిటీ నివేదిక అందిన తర్వాత స్కూళ్లు తెరవడంపై ఏం చేయాలన్నది జూలై 5 తర్వాత నిర్ణయిసామన్నారు. మరోవైపు రాష్ట్రంలో కరోనా తీవ్రత ఇంకా తగ్గకపోవడంతో ఆగస్ట్ లేదా సెప్టెంబర్‌లో స్కూళ్లను పునరుద్ధరించాలని తల్లిదండ్రులు కోరుతున్నట్లు ఆయన చెప్పారు. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు ఉండబోవని మంత్రి స్పష్టం చేశారు. స్కూళ్ల యాజమాన్యాలు వారంలో కనీసం రెండు సార్లు విద్యార్థులతో మాట్లాడాలని సూచించారు.



స్కూళ్లు తెరవడంపై మీడియాతో మాట్లాడిన కర్ణాటక విద్యాశాఖ మంత్రి ఎస్ సురేశ్ కుమార్

# మహారాష్ట్రలో మళ్లీ లాక్‌డౌన్

### జూలై 31 వరకు విధిస్తూ ప్రభుత్వ ప్రకటన

ముంబై,జూన్29(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర మరోఆరు లాక్‌డౌన్‌లోకి వెళ్లనుంది. కరోనా విజృంభతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కరోనా వైరస్ రోజు రోజుకీ విజృంభిస్తున్న నేపథ్యంలో మరోసారి రాష్ట్రమంతా లాక్‌డౌన్ విధించాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జూలై 31 వరకు లాక్‌డౌన్ పొడిగిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది. మరోసారి ప్రజలు కఠినంగా లాక్‌డౌన్ నిబంధనలను పాటించాలంటూ మార్గదర్శకాలను జారీ చేసింది. అత్యవసమైతేనే బయటకు రావాలని, నాన్ ఎసెన్షియల్స్ కోసం దగ్గర ప్రాంతాల్లోనే పని చూసుకోవాలని సూచించింది. ఎటువంటి పరిస్థితిలోనైనా బయటకు వస్తే ఫేస్ మాస్క్ కట్టుకోవడం, సామాజిక దూరం పాటించడం మర్చిపోకూడదని పేర్కొంది. ఆఫీసులకు వెళ్లేవారిని, అత్యవసర పనులపై బయటకు వచ్చే వారిని మాత్రమే ఎటువంటి ఆంక్షలు లేకుండా అనుమతిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మెడికల్ రీజన్స్‌తో బయటకు వచ్చే వారిపైనా ఆంక్షలు ఉండవని తెలిపింది. వైరస్ వ్యాప్తి నియంత్రణ విషయంలో జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లు కఠిన చర్యలు తీసుకోవాలని మహారాష్ట్ర ప్రభుత్వం సూచించింది. స్థానిక పరిస్థితులను బట్టి ఆయా ప్రాంతాల్లో నాన్ ఎసెన్షియల్ సర్వీసులను ఏ మేరకు అనుమతించాలి, ప్రజలు బయటకు రావడంపై ఆంక్షల విధింపు వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది.

# కరోనా బాధితులకు బియ్యం పంపిణీ

హైదరాబాద్,జూన్29(ఆర్ఎన్ఎ): కరోనా పోరులో ముందుండి పోరాడిన పారిశుద్ధ్య కార్మికులు కరోనా వైరస్ బారిన పడటంతో వారి కుటుంబాలకు తెరాస నాయకుడు భోదాసు లక్ష్మీనారాయణ సోమవారం నిత్యావసర సరకులను అందజేశారు. మల్లాపూర్ డివిజన్‌కు చెందిన 11మంది కరోనా బాధితుల కుటుంబాల ఇళ్లకు వెళ్లి ఒక్కొక్కరికి 25కిలోల బియ్యంతోపాటు ఇతర నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరోనా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు రోగ నిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు కషాయాలు తాగాలని సూచించారు. ప్రతిరోజు వైద్యులు సూచించే పోషకాహారం తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు కరోనా నుంచి కోలుకునేంతవరకు బాధిత కుటుంబాలకు కావాల్సిన అవసరాలు తీర్చుతానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెరాస నాయకులు నాగారం చంద్రశేఖర్, నాగేందర్, ప్రకాశ్, రమణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

# కరోనా చికిత్సపై దుష్ప్రచారం తగదు

### ఎంతమందికి అయినా చికిత్స చేసేందుకు సిద్ధం
### వైద్యులను అవమానపరిచేలా పోస్టులు తగవు
### సోషల్ మీడియా వార్తలు నమ్మొద్దు
### లాక్‌డౌన్‌పై త్వరలోనే సిఎం కెసిఆర్ నిర్ణయం
### మీడియా సమావేశంలో మంత్రి ఈటెల రాజేందర్

హైదరాబాద్,జూన్29(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ దవాఖానల్లో వేలమందికి కరోనా చికిత్స అందిస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. ఆరోగ్యశాఖలో 250 మంది సిబ్బందికి కరోనా పాటిజివ్ వచ్చిందన్నారు. కరోనాతో హెడ్ నర్సు చనిపోయిందని తెలిపారు. వైద్యులు ప్రాణాలు పణంగాపెట్టి ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో దష్ప్రచారం చేయడం తగదని, ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది ఆత్మైస్థైర్యం దెబ్బతీయోద్దని సూచించారు. సోమవారం నాడాయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు 184 మంది పోలీసులకు కరోనా పాజిటివ్ వచ్చిందని, వారు కోలకుని ప్రజలకు ధైర్యం ఇచ్చారని వెల్లడించారు. సామాచిక మాధ్యమంలో వచ్చిన సమాచారం నమ్మొద్దని, ప్రభుత్వం ఇచ్చే బులెటిన్‌లను మాత్రమే నమ్మాలని విజ్ఞప్తి చేశారు. లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత అన్ని రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. కరోనా విషయంలో గత నాలుగు నెలల క్రితం ఉన్న భయాందోళనలు ఇప్పుడు లేవని అన్నారు. మొదట్లో కరోనాతో చనిపోతారనే భయం ప్రజల్లో ఉండేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో కరోనా కేసుల్లో మరణాలు 1.7 శాతం మాత్రమే ఉన్నాయని వివరించారు. దేశంలో ఇది 3 శాతంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు కరోనాతో 240 మంది చనిపోయారని తెలిపారు. రోగి ఎప్పుడు వచ్చినా సరే చికిత్స అందించే సౌకర్యాలు ప్రభుత్వ దవాఖానల్లో ఉన్నాయన్నారు. 4700 మంది వైద్య సిబ్బందిని నియమించామని, 150 అంబులెన్సులు అదనంగా తీసుకున్నామని చెప్పారు. కరోనా బాధితుల కోసం 17,801 పడకలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే 3500 పడకలకు ఆక్సిజన్ సమకూర్చామని, మరో నాలుగైదు రోజుల్లో 6,500 పడకలకు ఆక్సిజన్ సమకూరుస్తామని తెలిపారు. మొత్తం 10వేల పడకలకు అవసరమైన ఆక్సిజన్ సమకూరుస్తామని చెప్పారు. గాంధీ దవాఖానలో 10 మంది రోగులు మాత్రమే వెంటిలేటర్‌పై ఉన్నారని చెప్పారు. ఆదివారం ఛాతి ఆసుపత్రిలో మృతిచెందిన వ్యక్తికి ఊపిరితిత్తుల సమస్య లేదని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో కరోనా కేసులు, మరణాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ నగరం కావడంతో ఎక్కువ కేసులు వస్తున్నాయని చెప్పారు. మిగతా నగరాల్లో ఉన్నంత విస్తృతి హైదరాబాద్‌లో లేదని, ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో పెరిగినట్లే నగరంలోనూ కేసులు పెరిగాయని వెల్లడించారు. హైదరాబాద్‌లో కేసులు ఉన్నచోట్ల కంటైన్‌మెంట్ జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అవసరమైతే హైదరాబాద్‌లో లాక్‌డౌన్‌పై ఆలోచనా చేయాల్సి ఉంటుందని సీఎం కేసీఆర్ చెప్పారన్నారు. నాలుగైదు రోజుల్లో మంత్రివర్గ సమావేశం ఉంటుందని తెలిపారు. కరోనా పరీక్షల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం నుంచి మళ్లీ కరోనా పరీక్షలు కొనసాగుతాయని, పెద్దమొత్తంలో స్వాబ్ సేకరణ చేపడతామన్నారు. ఐసీఎంఆర్ నిబంధనలకు అనుగుణంగా హోం క్వారంటైన్‌లో చికిత్స అందిస్తామని చెప్పారు. కరోనా లక్షణాలు లేనివారిని హోం క్వారంటైన్‌లో ఉంచుతున్నామని, లక్షణాలున్న వారికి మాత్రమే దవాఖానల్లో చికిత్స అందిస్తామని చెప్పారు. కోవిడ్ టెస్టులను కేవలం కోఠి తదితర ఆస్పత్రుల్లో చేస్తున్నామని, గాంధీలో కేవలం చికిత్సమాత్రమే అందిస్తామని అన్నారు.

# ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తాం: మంత్రి నిరంజన్

వనపర్తి,జూన్29(ఆర్ఎన్ఎ): సాగుకు యోగ్యమయ్యే ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తామని వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. జిల్లాలోని పెద్దగూడెంలో వైకుంఠధామాన్ని ప్రారంభించి, ఖాన్ చెరువుకు నీళ్లు నింపే లిఫ్ట్ పనులకు మంత్రి భూమిపూజ చేసి మాట్లాడారు. పెద్దగూడెం కల నెరవేరింది. మాట ఇచ్చా .. నిలబెట్టుకుంటున్నానని మంత్రి తెలిపారు. 1500 ఎకరాలకు సాగు నీరు, దాదాపు 400 మంది రైతులకు దీంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. రూ.79 లక్షలతో 120 హెచ్ పీ మోటారుతో ఖాన్ చెరువు నింపేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఖాన్ చెరువు నింపి రాములవారి పాదాలు కడుగుతానన్నారు. విపక్ష నేతలు ఫిర్యాదులతో నీళ్లు రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. రైతుల శ్రేయస్సే ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో గానో కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో చేపట్టిన దాదాపు అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌దన్నారు. పాలమూరు ప్రాజెక్టులను కూడా పూర్తి చేస్తున్నామని అన్నారు.

# మొబైల్ కోర్టు ప్రారంభం



న్యాయప్రక్రియలో అంతరాయం లేకుండా ఉండేందుకు వరంగల్‌లో మోబైల్ కోర్టును ప్రారంభించిన జిల్లా న్యాయమూర్తి

వరంగల్,జూన్29(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో న్యాయ విచారణకు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగేందుకు జిల్లా కోర్టుల సముదాయంలో మొబైల్ కోర్టును జిల్లా కలెక్టర్, జిల్లా న్యాయమూర్తి ప్రారంభించారు.

న్యాయవాదులు, కక్షి దారులకు మధ్య వాద ప్రతివాదాలను న్యాయమూర్తి వీడియో లింకేజీ ద్వారా విని తద్వారా కేసుల పరిష్కారానికి ఈ మొబైల్ కోర్టులు ఉపయోగపడనున్నాయి.

# ఢిల్లీలో ప్లాస్మా బ్యాంకు ఏర్పాటు

### డాక్టర్ ఆసీమ్ గుప్తా కుటుంబానికి కోటి పరిహారం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ,జూన్29(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ చికిత్సలో ప్లాస్మా థెరపి కీలకంగా మారిన నేపథ్యంలో రాజధాని డిల్లీ ప్లాస్మా బ్యాంక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఢిల్లీ సీఎం కేజీవ్రాల్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కోవిడ్19 రోగుల చికిత్స కోసం ఎ÷-లాస్మా కొరత ఉన్నదని, ఆ సమస్యను అధిగమించేందుకు ఐఎల్‌బీఎస్ హాస్పిటల్‌లో ప్లాస్మా బ్యాంక్‌ను ప్రారంభించనున్నట్లు సీఎం తెలిపారు. కోవిడ్ నుంచి కోలుకున్న వారు ప్లాస్మాను దానం చేయాలని ఆయన అభ్యర్థించారు.

డాక్టర్ అసీమ్ గుప్తా కుటుంబానికి కోటి నష్టపరిహారాన్ని ఇవ్వనున్నట్లు సీఎం కేజీవ్రాల్ వెల్లడించారు. ఎల్ఎన్‌జేపీ హాస్పిటల్ డాక్టర్ అసీమ్ గుప్తా మృతి పట్ల సీఎం కేజీ విచారం వ్యక్తం చేశారు. డాక్టర్ అసీమ్ లాంటి వారి వల్లే మనం కోవిడ్19తో పోరాడుతున్నామన్నారు. ఆ డాక్టర్ కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. ఇదిలావుంటే కరోనా వైరస్‌తో ప్రాణాలు కోల్పోయిన వైద్యుడు అషీమ్‌గుప్తా కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.కోటి గౌరవ వేతనం చెల్లించనున్నట్లు ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ ప్రకటించారు. లోక్ నాయక్ జయప్రకాశ్ దవాఖానలో సీనియర్ డాక్టర్‌గా సేవలందిస్తున్న అషీమ్‌గుప్తా కరోనా వైరస్ బారినపడి ఆదివారం సాకేత్‌లోని మ్యాక్స్ దవాఖానలో చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేజీవ్రాల్ ఆయన సేవలను కొనియాడారు. కొవిడ్-19 పోరాటంలో మేము విలువైన ÷ౖటర్‌ను కోల్పోయామన్నారు. తనకు త్యాగానికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఆయన భార్యకు సంతాపం తెలిపి, ప్రభుత్వం తరపున మద్దతు ఇచ్చినట్లు ట్వీట్ చేశారు. అలాగే విలేకరుల సమావేశంలోనూ డాక్టర్ గుప్తాకు నివాళులర్పించారు. జూన్ 3న ఎల్ఎన్‌జేపీలో విధుల్లో చేరారని తెలిపారు. డాక్టర్ అయిన అతని భార్య కూడా వైరస్ బారినపడి కోలుకున్నారని తెలిపారు. ప్రభుత్వం అతని కుటుంబానికి రూ.కోటి గౌరవంగా ఇస్తున్నామని, అతని జీవితానికి ఎప్పుడూ వెలకట్టలేమన్నారు.

# ప్రపంచవ్యాప్తంగా కోటి దాటిన కేసులు

### 5లక్షలు దాటిన మరణాల సంఖ్య

న్యూయార్క్,జూన్29(ఆర్ఎన్ఎ): ప్రపంచంలో కరోనా మహమ్మారి ఉగ్రరూపం దాల్చుతున్నది. ఈ వైరస్ బారినపడిన వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 1,02,43,858 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ వల్ల ఇప్పటివరకు మొత్తం 5,04,410 మంది మరణించారు. కరోనా బారినపడిన వారిలో 55,53,495 మంది కోలుకోగా, 41,85,953 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. క్లోజింగ్ కేసుల్లో 92 శాతం మంది కరోనా నుంచి కోలుకుంటే, 8 శాతం మంది బాధితులు చనిపోయారు. అమెరికాలో కరోనా ఉధృతి కొనసాగుతున్నది. కరోనా కేసుల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న ఈ దేశంలో ఇప్పటివరకు నమోదైన కరోనా కేసుల సంఖ్య 26,37,077కు చేరింది. ఇందులో 1,28,437 మంది బాధితులు చనిపోగా, 10,93,456 మంది కోలుకున్నారు. మొత్తం కేసుల్లో 14,15,825 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. రెండో స్థానంలో ఉన్న బ్రెజిల్‌లో ఇప్పటివరకు 13,45,254 కరోనా కేసులు నమోదయ్యాయి. దేశంలో ఇప్పటివరకు 57,658 మంది బాధితులు మరణించారు. ఇక రష్యాలో కరోనా కేసుల సంఖ్య 6,34,437కు చేరింది. దేశంలో కరోనా బారినపడినవారిలో 9,073 మంది చనిపోగా, 3,99,087 మంది బాధితులు కోలుకున్నారు. మరో 2,26,277 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. నాలుగో స్థానంలో భారత్‌లో ప్రతిరోజు రికార్డు స్థాయిలో పాజిటివ్ కేసులు నమోదవదుతున్నాయి. తాజాగా 20 వేలకుపైగా కేసులు నమోదవడంతో దేశంలో కరోనా కేసుల సంఖ్య 5,49,197కు చేరింది. ఇప్పటివరకు 16,487 మంది మరణించగా, 2,10,936 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. యూకేలో ఇప్పటివరకు 3,11,151 కరోనా కేసులు నమోదవగా, 43,550 మంది మృతిచెందారు. స్పెయిన్‌లో కరోనా కేసుల సంఖ్య 2,95,850కి చేరగా, 28,343 మంది చనిపోయారు. పెరూలో 279,419 కరోనా కేసులు నమోదవగా, 9,317 మంది బాధితులు మృతిచెందారు. చిలీలో కరోనా కేసుల సంఖ్య 2,71,982కి చేరగా, 5509 మంది మరణించారు. ఇటలీలో ఇప్పటివరకు 2,40,310 కేసులు నమోదవగా, 34,738 మంది బాధితులు చనిపోయారు. ఇరాన్‌లో కరోనా కేసుల సంఖ్య 2,22,669కి చేరగా, 10,508 మంది మృతిచెందారు. మెక్సికోలో ప్రతి రోజు నాలుగువేల పైచిలుకు కేసులు నమోదవుతున్నాయి. దీంతో దేశంలో కరోనా కేసుల సంఖ్య 2,16,852కి చేరింది. మొత్తం 26,648 మంది బాధితులు మరణించారు. దేశంలో నిన్న ఒక్కరోజే 4050 కేసులు నమోదవగా, 267 మంది మృతిచెందారు.

# మధ్యప్రదేశ్‌లో కరోనా కంట్రోల్

### వెల్లడించిన ఆరోగ్యశాఖ మంత్రి నరోత్తమ్ మిశ్రా

భోపాల్,జూన్29(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి అదుపులోనే ఉందని అక్కడి ఆరోగ్యశాఖ మంత్రి నరోత్తమ్ మిశ్రా అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మా రాష్ట్రంలో వైరస్ వ్యాప్తి 72శాతం మాత్రమే ఉందన్నారు. కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య ఇప్పుడు 2500 ఉండగా తాము 25,000 బెడ్లను సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఢిల్లీ, ముంబయ్‌లతో పోల్చుకుంటే మా వద్ద రోగుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, ఒకవేళ వ్యాధి తీవ్రత పెరిగినా మేము దాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతామనే ధైర్యం ఉందన్నారు. మా వద్ద బెడ్లు, ఆక్సీజన్, వెంటిలేటర్ల విషయంలో ఎలాంటి కొరత లేదని, మాస్కులు, పీపీఈ కిట్లు కూడా పూర్తిస్థాయిలో సమకూర్చామని, మధ్యప్రదేశ్‌లో పరిస్థితి ఇంకా చేయి దాటి పోలేదని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అయితే మధ్యప్రదేశ్‌లో ఇప్పటివరకు 13186 పాజిటివ్ కరోనా కేసులుండగా, 10084 మంది డిశ్ఛార్జి అయ్యారు. 2545 మంది దవాఖానల్లో చికిత్స పొందుతుండగా.. 557 మంది మృతి చెందినట్లు వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది తెలియజేశారు.

# నియమాలు పాటిస్తేనే..భవిష్యత్తు ఆనందం

వేములవాడ, జూన్ 29:హనచోదకులు వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే భవిష్యత్తు ఆనందంగా ఉంటుందని వేములవాడ డిఎస్పి చంద్రకాంత్ అన్నారు. వేములవాడ పట్టణం లోని హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ వారి సౌజన్యం తో పట్టణ పరిధి లో ట్రాఫిక్ సిగ్నల్స్ సూచికలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని రాజన్న గుడి వద్ద బోర్డు ల ఏర్పాటు ను స్థానిక డి ఎస్ పి చంద్రకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించడం తో మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది అని తెలిపారు. ఇన్స్పెక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు ప్రతీ ఒక్కరూ పాటించాలి అని లేకుంటే కఠిన చర్యలు తప్పవు అని. మైనర్ ల కు వాహనాలు ఇస్తే వాహన యజమానుల మీద చట్ట రీత్యా చర్యలు తీసుకొని వాహనాన్ని సీజ్ చేస్తాం అని, పట్టణం లో చాలా మంది హెల్మెట్ ధరించకుండా వాహనం నడుపుచున్నారు అని, విధిగా ప్రతీ ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్ ధరించాలి అని లేకుంటే చలాన్ లు విధిస్తాం అని, ప్రతీ వాహన దారుదు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలి అని అందరికి శ్రేయస్కరం అని తెలిపారు. ఈ కార్యక్రమం లో సబ్ ఇన్స్పెక్టర్ శివకేశవులు, హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ మేనేజర్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.




వాసా ఫౌండేషన్
మరియు
నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో
ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి
స్మారక కవితల పోటీలు
కరోనా మహమ్మారి విజృంభన నేపథ్యంలో
ప్రజలెదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై దృష్టి సారించి
"వలస కార్మికులు"
అన్న అంశం మీద మీ కవితాస్త్రాల్ని సంధించండి
బహుమతుల వివరాలు:
- మొదటి బహుమతి : రూ.5000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- రెండవ బహుమతి : రూ.2,500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- తృతీయ బహుమతి : రూ.1,000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- 10 ప్రోత్సాహక బహుమతులు: రూ.500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం
బహుమతులు గెలుచుకున్న కవితలతో పాటు ప్రచురణకు ఎంపికచేసిన కవితలను 'నేటినిజం'లో ప్రచురించబడును.
నిబంధనలు:
1) కవిత 25 లైన్లకు మించకూడదు.
2) వలస కార్మికుల సమస్యలపైనే ఉండాలి.
3) అనువాద కవితలు పోటీకి అంగీకరించబడవు
4) కవితను ఏ పత్రికకు పంపలేదని, సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని ఈ పోటీ నిమిత్తమే రాసినదని హామీ తప్పక జత చేయాలి.
5) హామీ పత్రంతో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా తప్పని సరి.
6) ఒకరు ఒక కవితను మాత్రమే పంపవలెను.
కవితలు పంపవలసిన చిరునామా:
'నేటినిజం' దినపత్రిక, ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20.
E-mail : netinizam2020@gmail.com
కవితలు పంపాల్సిన చివరి తేదీ : 15-7-2020

# క్రికెటర్‌ను మింగిన కరోనా

### చికిత్స పొందుతూ సంజయ్ దబోల్ మృతి

న్యూఢిల్లీ,జూన్29(ఆర్ఎన్ఎ): ప్రసిద్ధ క్రికెటర్, ఢిల్లీ అండర్ -23 సహాయక సిబ్బందిగా సేవలందించిన సంజయ్ దోబల్ కన్నుమూశారు. కొవిడ్ -19 నుంచి కోలుకోలేక సోమవారం ఉదయం చనిపోయినట్లు ఆయన కుటుంబ సన్నిహితవర్గాలు తెలిపాయి. 53 ఏండ్ల వయసున్న దోబల్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుదు సిద్ధాంత్.. రాజస్థాన్ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడుతుండగా.. చిన్న కుమారుడు ఏకాన్ష్ ఢిల్లీ అండర్ -23 జట్టులో అరంగేట్రం చేశాడు. 'కరోనా వైరస్ లక్షణాలు బయటపడటంతో సంజయ్ దోబల్ వారం రోజుల క్రితం మహదూర్‌గఢ్‌లోని దవాఖానలో చేరాడు. కొవిడ్ -19 కు పాజిటివ్‌గా నిర్ధారణ అయిన తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారింది. మరింత మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం ఆయనను ద్వారకా దవాఖానకు మార్చి ఎ÷-లాస్మా చికిత్స అందించారు. అయినప్పటికీ ఫలితం లేకపోగా సోమవారం ఉదయం కన్నుమూశారని డీడీసీఏ అధికారి ఒకరు చెప్పారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో సుపరిచితుడైన సంజయ్ దోబల్.. ఢిల్లీ క్రికెటర్లలో వీరేందర్ సెహ్వాగ్, గౌతమ్ గంభీర్, మిథున్ మన్హాస్‌తో కలిసి ఆడారు. అతను సొనెట్ క్రికెట్ క్లబ్ తరఫున ఆడి కోచ్ తారక్ సిన్హా శిక్షణలో రాటుదేలారు. రంజీలో ఆడనప్పటికీ.. దోబల్ ఎయిర్ ఇండియాతో కాంట్రాక్ట్ ముగిసిన తరువాత జూనియర్ క్రికెటర్లకు శిక్షకుడిగా సేవలందించారు. గత దశాబ్దంలో జామియాలో జరిగిన ఇంగ్లండ్ మహిళల టెస్టులో దోబల్ ఇండియా జట్టుకు మేనేజర్‌గా



వ్యవహరించారు. సంజయ్ దోబల్ బీసీసీఐ మాజీ యాక్టింగ్ అధ్యక్షుడు సీకే ఖన్నాతోపాటు ఢిల్లీకి చెందిన క్రికెటర్లు మదన్ లాల్, మన్హాస్, డీడీసీఏ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు.

# ఒడిషా ప్రభుత్వం కీలక నిర్ణయం

### క్వారంటైన్‌లో ఉన్న వారికి 2వేల నగదు జమ

భువనేశ్వర్,జూన్29(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకున్నది. క్వారంటైన్ కేంద్రాల్లో ఉన్న వారికి రూ.2,000 నగదు చెల్లిస్తున్నది. లాక్‌డౌన్ నేపథ్యంలో వలస కార్మికులు ప్రత్యేక శ్రామిక్ రైళ్లలో సొంత రాష్ట్రాలకు చేరుతున్నారు.

అయితే కొందరు క్వారంటైన్ నిబంధనలను పాటించడం లేదు. దీంతో పలు రాష్ట్రాల్లో ఇటీవల కరోనా కేసుల సంఖ్య బాగా పెరుగుతున్నది.

ఈ నేపథ్యంలో ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం ఒక కొత్త విధానాన్ని అమలు చేస్తున్నది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రాల్లో ఉన్నవారి బ్యాంకు ఖాతాల్లో రూ.2,000 జమ చేస్తున్నది. ఇటీవల ఓ వ్యక్తి జాజ్‌పూర్‌లోని క్వారంటైన్ కేంద్రంలో పది రోజులపాటు ఉన్నాడు. అనంతరం అక్కడి నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు తన బ్యాంకు ఖాతాలో రూ.2,000ను ప్రభుత్వం జమ చేసినట్లు అతడు తెలిపాడు. కార్వంటైన్ కేంద్రంలో ఉన్నన్ని రోజులు తాను ఉపాధి కోల్పోయానని, ప్రభుత్వం ఇచ్చిన ఈ డబ్బులు కొంత మేర సహాయంగా ఉంటాయని అతడు పేర్కొన్నాడు.

...............

# చేయూతలోనే.. ఆనందం




వేములవాడ, జూన్ 29: సహాయం కోసం ఎదురుచూస్తున్న వారికి చేయూతనివ్వడంలో ఉన్న ఆనందం మరో దానిలో లభించదని టి ఆర్ కె ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ అన్నారు. మహేష్ తన కుమారు డైన హర్షవర్ధన్ మొదటి జన్మదినం సందర్భంగా టి ఆర్ కె ట్రస్ట్ వర్కింగ్ టీమ్ సభ్యులు కోనరావుపేట మండలంలోని మర్తన పేట గ్రామానికి చెందిన అనాథ చిన్నారులైన భవాని, భార్గవి, విష్ణులకు12 రకాల నిత్యావసర సరుకులు, 25 కిలోల బియ్యంను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కె.వి మహేష్ రెడ్డి, తోట దీపక్, విజయ్ యాదవ్, ప్రతాప్, సంతోష్ గౌడ్, సందీప్ గౌడ్, ప్రదీప్, ప్రేమ్, రాకేష్, కృష్ణ, మణికంఠ, అన్వేష్, సన్నీత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.